ప్రజాశక్తి

శనివారం 25 మార్చి 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విమాన ప్రయాణాల్లో వెనక్కి..

- విశాఖ కంటే ముందుకు దూసుకెళ్లిన భువనేశ్వర్
- స్లాట్‌ల కొరతతో ఇబ్బందుల్లో వైజాగ్ విమానాశ్రయం
- నేవీ, ఎఎఐ, విమాన సర్వీసు సంస్థల మధ్య కొనసాగుతున్న వార్



విశాఖపట్నం విమానాశ్రయం (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ.. విమాన ప్రయాణాల్లో వెనక్కి వెళ్లింది. స్లాట్‌ల కొరత, నేవీ, ఎఎఐ, విమాన సర్వీసు సంస్థల మధ్య కొనసాగుతున్న వార్ తదితర కారణాలతో స్థానిక విమానాశ్రయం ఇటీవల పలు ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. గత నెలలో విశాఖ విమానాశ్రయం నుంచి ఎయిర్ ప్రయాణాలు సాగించిన వారి సంఖ్య 2.4 లక్షలు కాగా భువనేశ్వర్ నుంచి 3.51 లక్షల మంది ఉన్నారు. విశాఖ కంటే 1.41 శాతం అక్కడ అధికం. ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) డేటా ప్రకారం ర్యాంకింగ్స్‌లో టాప్ – 20 విమానాశ్రయాల్లో భువనేశ్వర్‌ది 14వ స్థానం కాగా, విశాఖ 19వ స్థానం దక్కించుకుంది. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం తర్వాత రెండో అతిపెద్ద విమానాశ్రయంగా పేరుగాంచిన విశాఖ స్లాట్‌ల కొరతతో నేడు అట్టుడుకుతోంది.

తొలి నుంచీ నేవీ నియంత్రణ

ఇండియన్ నేవీ రక్షణ అవసరాలను ఒకవైపు, దేశ, విదేశాలకు ప్రయాణాలను మరోవైపు బ్యాలెన్స్ చేస్తూ స్లాట్‌లపై ఇక్కడ నేవీ నియంత్రణ చేస్తున్న విషయం తెలిసిందే. ముంబయి నుంచి అత్యధికంగా ఎయిర్ ట్రాఫిక్ మనకు ఉంటుందని, స్లాట్‌లు మనకు వారు అడిగిన సమయాల్లో ఉండడం లేదని ఎయిర్ పోర్టు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు 'ప్రజాశక్తి'కి వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ విమానాశ్రయాన్ని నేవీ తొలి నుంచీ వినియోగిస్తోంది. దీంతో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటలలోపు తక్కువ మొత్తంలోనే విశాఖ నుంచి కమర్షియల్ ప్రయాణాలకు అవకాశాలు దక్కుతున్నాయి. రోజు మొత్తంలో 12 గంటల వ్యవధిలో 30 విమానాలే ల్యాండింగ్, టేకాఫ్ ఇక్కడ నుంచి అవుతున్నాయి. స్లాట్‌ల పరిమితి వల్లే ఇదంతా కొనసాగుతోంది. కేంద్ర రక్షణ శాఖ, ఇండియన్ ఎయిర్‌లైన్స్ మంత్రిత్వశాఖ అధికారులకు ఈ సమస్యకు సంబంధించిన సమాచారం ఇచ్చి వారిని ఒప్పించేలా విశాఖపట్నం ఎంపీ ఎంవివి సత్యనారాయణ చొరవ చేయాలని తాజాగా జరిగిన మిగతా 2లో..



వికెట్ తీసిన ఆనందంలో తెలుగు వారియర్స్ క్రీడాకారులు

సినీ తారల క్రికెట్ సందడి

ఉత్కంఠభరితంగా విశాఖలో సిసిఎల్ సెమీ ఫైనల్స్ వార్త మెయిన్‌లో..

ప్రాధాన్యతా రంగాలకు రుణాలు

బ్యాంకర్లను ఆదేశించిన విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న వ్యవసాయ, ఎస్‌హెచ్‌జి బ్యాంక్ లింకేజ్, హౌసింగ్, ఎపి టిడ్కో ఇళ్ల తదితర రంగాలకు లక్ష్యం మేరకు అందరు బ్యాంకర్లు రుణాలందించి జిల్లా ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బ్యాంకర్లు, జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మిగతా 2లో..

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో ఎలా చేరుస్తారు ?

వార్త 2లో..

సమస్యలపై జివిఎంసి కార్మికుల ధర్నా

వార్త 2లో..

ముగిసిన గోవాడ సుగర్స్ క్రషింగ్

వార్త 5లో..

రామజోగిపేట మృతులకు..

నష్టపరిహారం చెల్లించాలి

- కలెక్టరేట్ వద్ద బాధిత కుటుంబాల ధర్నా

ప్రజాశక్తి – కలెక్టరేట్ : విశాఖ నగరంలోని 29వ వార్డు రామజోగిపేటలో పురాతన భవనం కూలి ముగ్గురు మృతిచెంది, పలువురు గాయపడిన ఘటనపై 48 గంటలు గడుస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమంటూ బాధిత కుటుంబీకులు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. మృతులకు నేటికీ ఎక్స్‌గ్రేషియో ప్రకటించకపోవడం శోచనీయమని వాపోయారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన తన నిధుల నుంచి తక్షణమే కొంత మొత్తం ఇచ్చేందుకు అంగీకరించారు. బాధితుల వివరాలు వెంటనే ఇవ్వాలని అడిగారు. భవనం యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరగా అందుకు అంగీకరించారు. బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జగదాంబ జోన్ నాయకులు ఎం.సుబ్బారావు, కర్రి చంద్రశేఖర్, స్థానికులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బాధిత కుటుంబాలు, సిపిఎం నేతలు

రైతు బజార్లలో అద్దె భారం

- చెల్లించలేకపోతున్నామంటున్న రైతులు
- రైతు భరోసా లబ్ధి కంటే అద్దె చెల్లింపునే ఎక్కువ
- ఏడాదికి కోటికిపైగా పెంపు



గోపాలపట్నం రైతు బజారు

ప్రజాశక్తి–అనకాపల్లి ప్రతినిధి

రైతు భరోసా కింద ప్రభుత్వం రూ.13,500 ఇచ్చినట్లే ఇచ్చి, అద్దె కింద ఏడాదికి రూ.36 వేలు వసూలు చేస్తోంది. ప్రభుత్వ సాయం కంటే అద్దె భారమే ఎక్కువ వుంది. గతంలో ఎన్నడూలేనంత అద్దె ప్రభుత్వం పెంచింది. వ్యాపారం తగ్గినా అద్దె చెల్లించక తప్పడంలేదు' – అని రైతు బజార్లలోని రైతులు వాపోతున్నారు. ఏడాదికి రూ.కోటికిపైగా పెంపు భారం వీరిపై పడటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని సబ్బవరం, కె.కోటపాడు, అనందపురం, పెందుర్తి, అరకులోయ, డుంబ్రిగుడ, పరవాడ, రావికమతం, దేవరాపల్లి, పాయకరావుపేట, కశింకోట, పద్మనాభం మండలాల్లోని పలు గ్రామాల నుంచి నగరంలోని రైతు బజార్లకు కూరగాయలు తెచ్చి రైతులు అమ్ముతున్నారు. వీరితో పాటు డ్వాక్రా సభ్యులు, హోల్‌సేల్, కమర్షియల్ వ్యాపారులకు కొన్ని స్టాల్స్ కేటాయించారు. గ్రామీణ ప్రాంతంలోని రైతులు నగరంలోని ఎంవిపి కాలనీ, సీతమ్మధార, మధురవాడ, పెదవాల్తేరు, నర్సింహనగర్, కంచరపాలెం, మర్రిపాలెం, గోపాలపట్నం, పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ, ములగాడ, స్టీల్‌ప్లాంట్ రైతుబజార్లలోని కేటాయించిన స్టాల్స్‌లో కూరగాయలు అమ్ముతున్నారు. 1823 మంది రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసినప్పటికీ వారికి తగ్గ స్టాల్స్ లేవు. పై 13 రైతు బజార్లలోని 1286 స్టాల్స్‌లో 226 కమర్షియల్, 197 ఫార్మర్ కమర్షియల్ స్టాల్స్‌కుపోనూ రైతులకు కేటాయించిన 881 స్టాల్స్‌లోనే 1823 మంది రైతులు సర్దుబాటు చేసుకొని కూరగాయాలు, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విమాన ప్రయాణాల్లో వెనక్కి..

ఎడ్వయిజరీ బోర్డు సమావేశంలో ఎయిర్ ట్రావలర్స్ అసోసియేషన్ వాళ్లు అభ్యర్థించారు. తన వంతు కృషి చేస్తానని, నేవీ అవసరాలు మినహా అత్యధికంగా స్లాట్‌లు సాధించే దిశగా ప్రయత్నిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

నేవీ అధికారులు ఏమంటున్నారు ?

'మేం చాలా వరకూ స్లాట్‌లు ఇస్తున్నాం. మీరు వాటినే వినియోగించడం లేదు' అంటూ నేవీ అధికారులు వాపోతున్నారు. మేం అడిగిన సమయాల్లో ఇవ్వడం లేదంటూ ఇండియన్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు చెబుతున్నారు. స్లాట్‌లు పెంచాలంటూ ఎయిర్ ట్రావలర్స్ అసోసియేషన్ వారు కోరుతున్నారు. ఇలా మూడు వాదనలు వినిపిస్తున్నాయని ఎయిర్ పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. విశాఖను రాష్ట్ర ప్రభుత్వం కార్యనిర్వాహక రాజధానిగా ప్రకటించాక కౌలాలంపూర్, దుబాయ్, కొలంబోలకు విశాఖ నుంచి విమానాలను తిప్పేందుకు కొన్ని విమానయాన సంస్థలు బిడ్స్ కూడా వేసినా కేవలం సింగపూర్‌కు మాత్రమే నేరుగా విమాన సర్వీసు విశాఖ నుంచి అందుబాటులో ఉంది. ముంబయి నుంచి విశాఖకు అత్యధికంగా డిమాండ్ ఉన్నా విశాఖలో స్లాట్‌లను ఇచ్చే నిర్ణయం నేవీపై ఆధారపడి ఉన్నందున ఈ వ్యవధిలో ముంబయి నుంచి ట్రాఫిక్ రావడం లేదు. ఉదయం 8 గంటల నుంచీ 12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకూ నేవీ వాడుతున్నందున ప్రయాణికుల సంఖ్య పడిపోతోంది. తమకు రక్షణ అవసరాల పీక్ టైంలో స్లాట్‌లు అడిగితే ఇవ్వలేం అంటూ నేవీ తొలి నుంచీ చేతులెత్తేస్తోంది. డొమస్టిక్ ట్రాఫిక్ విషయానికొస్తే ముంబయి, చెన్నయ్, ఢిల్లీ, హైదరాబాద్ నుంచి ఫ్లైట్స్ విశాఖకు రావాలి. రోజుకు ఢిల్లీ నుంచి 1000, ముంబయిలో 600, చెన్నయ్‌లో 500, బెంగళూరులో 600 ఫ్లైట్స్ వేర్వేరు చోట్లకు రాకపోకలు సాగిస్తుండగా విశాఖ నుంచి రోజుకు 30కి మించడం లేదు. భువనేశ్వర్ నుంచి 100 వరకూ వేర్వేరు చోట్లకు వెళు తున్నాయి. ఎయిర్ లైన్స్ సంస్థలైన ఇండిగో, ఆకాశ, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఏషియా, స్పైస్ జెట్, స్కై జెట్, ఇండియా-1 ఇవన్నీ దేశీయంగా రాకపోకలు సాగిస్తున్నాయి. అంతర్జాతీయంగా ఒకే ఒక్క స్కూట్ ఫ్లైట్ ఇక్కడ నుంచి ఉంది. విశాఖ నుంచి ప్రయాణికుల రాకపోకలు 2023 మార్చికి 23 లక్షలుగా ఉంది. దేశంలో ఢిల్లీ 43.51 లక్షలతో అగ్రస్థానంలో ఉంది. ముంబయి 31.86 లక్షలు, బెంగళూరు 27.89 లక్షలు, హైదరాబాద్ 15.77 లక్షలతో ఉన్నాయి. భువనేశ్వర్ నుంచి ఏటా 30 లక్షల వరకూ రాకపోకలు సాగిస్తున్నారు.

దుబాయ్ సర్వీసు కోసం ప్రయత్నాలు

విశాఖ నుంచి దుబాయ్‌కి సర్వీసు కోసం ఇండిగో అధికారులతో చర్చలు జరుగుతున్నాయని ఎయిర్ పోర్టు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ విషయంపై స్వయంగా విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ చొరవ చేస్తున్నారన్నారు.

రైతు బజార్లలో అద్దె భారం

ఆకుకూరలు విక్రయిస్తున్నారు.

తమ సొంత పొలంలో పండించిన కూరగాయలు తెచ్చుకొని అమ్ముకొనే రైతులకు ఉచితంగా స్టాల్స్ కేటాయించే పద్ధతి మొదటి నుంచీ కొనసాగుతోంది. పొలంలో పండించిన కూరగాయలతో పాటు ఒకటి, రెండు కూరగాయాలు తోటి రైతులు, లేదా మార్కెట్లో కొనుక్కొని రైతు బజార్లలో విక్రయించిన రైతుల నుంచి నెలకు మూడు వేల రూపాయల అద్దెను ప్రభుత్వం వసూలు చేస్తోంది. పొలంలో పండించుకొని రైతు బజార్లలో విక్రయించే పువ్వులు, అరటి, బొప్పాయి పంటలను వాణిజ్య పంట కింద గుర్తించి ఒక పూటకు గుర్తింపు కార్డున్న రైతు నుంచి రూ.3,600 చొప్పున అద్దె వసూలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 చెల్లిస్తుంటే, మా దగ్గర ఏడాదికి అద్దె రూపంలో రూ.43,200 వసూలు చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూ.1200 వున్న అద్దె, ఈ ప్రభుత్వంలో రూ.3,600కు పెరిగిందని వాపోతున్నారు. ఒకపూట కరివేపాకు అమ్ముకున్న మహిళల స్టాల్‌కు రూ.1200 నుంచి రూ.1800కు అద్దె పెంచారు. ఉల్లిపాయలు, బంగాళాదుంపలు విక్రయిస్తున్న డ్వాక్రా సభ్యుల స్టాల్‌కు రూ.9 వేలకు అద్దె పెంచారు. గతంలో రైతు బజార్ల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదలచేసేది. ఈ ప్రభుత్వం నిర్వహణ ఖర్చుకు నిధులు విడుదల చేయకపోవడంతో రైతు బజార్లలో స్టాల్‌ను బట్టి, ఆ ప్రాంతంలోని డిమాండ్‌ను బట్టి అద్దె నిర్ణయించి వసూలు చేస్తున్నారు. దీంతో 13 రైతు బజార్ల నుంచి 2022 జులై నాటికి నెలకు రూ.23,99,556 వసూలుకాగా, అద్దెలు పెంచడంతో ఆ ఆదాయం రూ.33,11,947కు పెరిగింది. నెలకు రైతు బజార్ల నుంచి అదనంగా రూ.9,12,391, ఏడాదికి కోటీ తొమ్మిది లక్షలా 48 వేలా 692 భారం మోపింది.

రైతు బజార్ల నిర్వహణ కోసమే అద్దెలు పెంచాం

రైతు బజార్ల నిర్వహణ కోసమే అద్దెలు పెంచాల్సి వచ్చింది. నామమాత్రపు అద్దెలు వసూలు చేస్తున్నాం. కమర్షియల్ స్టాల్స్ నుంచి, ఇతరుల నుంచి అద్దెలు వసూలు చేయడంలేదు.

షేక్ యాసిన్,
జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి

ప్రాధాన్యతా రంగాలకు రుణాలు

జిల్లా రుణ ప్రణాళిక మూడో త్రైమాసికం అమలు, సాధించిన ప్రగతిపై బ్యాంకర్లతో డిసిసి/డిఎల్‌సిఆర్ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొత్తం రుణ ప్రణాళికలో డిసెంబర్ 2022 నెలాఖరుకు రూ.49,422 కోట్లు పంపిణీతో 186 శాతం ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ రుణాల నిమిత్తం రూ.3,999 కోట్లు లక్ష్యానికిగాను రూ.4,103 కోట్లతో 103 శాతం, ప్రాధాన్యతా రంగాలకు సంబంధించి రూ.13,758 కోట్ల లక్ష్యానికిగాను రూ. 9,454 కోట్లు పంపిణీతో 70 శాతం ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు.

సమస్యలపై జివిఎంసి కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తమ సమస్యలను పరిష్కరించాలంటూ జివిఎంసి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహా ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం గౌరవ అధ్యక్షులు జి.సుబ్బారావు, పి.వెంకటరెడ్డి మాట్లాడారు. పారిశుధ్య కార్మికుల 482 పోస్టులు భర్తీ కోసం, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ఈ మహాధర్నా విజయవంతమైందన్నారు. కార్మికులకు పనిముట్లు, సేఫ్టీ పరికరాలు, సబ్బులు, కోకోనెట్ ఆయిల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు, వాటర్ సప్లయి కార్మికులకు, ఫిట్టర్ హెల్పర్, ఎలక్ట్రికల్ హెల్పర్, టర్న్ కాక్లకు, క్లాప్ డ్రైవర్స్‌కు రూ.18500 మేర సెమీ స్కిల్డ్ జీతాలు ఇవ్వాలన్నారు. యుజిడి, వెటర్నరీ కార్మికులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. ఖాళీ పోస్టులను డెత్, సిక్, లాంగ్ ఆఫ్‌సెంట్ ఉన్నవారి కుటుంబ సభ్యులకు కేటాయించాలన్నారు. ధర్నా వద్దకు జివిఎంసి ఎడిసి సన్యాసిరావు వచ్చి తమ పరిధిలోని



ధర్నాలో పాల్గొన్న జివిఎంసి కార్మికులు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఏప్రిల్ 10వ తేదీలోగా సమస్యలను పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ధర్నాలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.నూకరాజు, వురుకుటి రాజు, ఎంవి.ప్రసాద్, గొలగాని అప్పారావు, జెఆర్.నాయుడు, రత్నం, ఈశ్వరరావు, గణేష్, ఆదినారాయణ, అప్పలరాజు, నాగరాజు, మీనాక్షి, వరలక్ష్మి, మహేశ్వరి, శంకర్ రెడ్డి, గొల్ల రాము, సత్యవతి పాల్గొన్నారు.

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో ఎలా చేరుస్తారు ?

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బోయ/వాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చాలని చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం సంఘం అధ్యక్షులు కటారి శోభన్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ తీర్మానాన్ని వేరొక ప్రకటనలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ అసోసియేషన్ కూడా ఖండించింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షులు బొండా తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎస్.సత్యనారాయణ సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

తీర్మానానికి వ్యతిరేకంగా శనివారం ఉదయం 8 గంటలకు కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. అందరూ హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ లబ్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఈ తీర్మానం చేసిందని పేర్కొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీని జయప్రదం చేయాలని విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపునిచ్చింది. ఈ మేరకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సిహెచ్.శ్రీనివాస్, పిసి.రాములు, లక్ష్మీనారాయణ, పోలినాయుడు, శరత్ మాట్లాడారు. కేరళ ప్రభుత్వం మాదిరి అన్ని ప్రభుత్వాలూ డ్రైవర్ల పట్ల వ్యవహరించాలన్నారు. సంవత్సరానికి మోటారు కార్మికులు సుమారు 3 లక్షల కోట్ల రూపాయల ఆదాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమకూర్చుతున్నారని, అయినప్పటికీ వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయలేదని తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రైవేటు కాలేజీ నిర్వాకంతో పరీక్షకు దూరం

కాలేజీ ఫీజు చెల్లించలేదని అందని హాల్‌టిక్కెట్లు

డిగ్రీ ఫైనలియర్ పరీక్ష రాయలేని ఆరుగురు విద్యార్థులు

యాజమాన్యం తీరుపై విద్యార్థుల ఆందోళన



కాలేజీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రైవేటు కాలేజీ యాజమాన్యం నిర్వాకం వల్ల డిగ్రీ ఫైనలియర్ పరీక్షలను ఆరుగురు విద్యార్థులు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. కాలేజీ ఫీజు చెల్లించలేదని హాల్‌టిక్కెట్లు రాకపోవడంతో శుక్రవారం జరిగిన పరీక్షకు వారిని అనుమతించ లేదు. దీంతో పరీక్షతోపాటు, విద్యాసంవత్సరాన్ని నష్టపోయేలా చేసి, విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడిన కాలేజీ యాజమాన్యం వైఖరిపై విద్యార్థులు నిరసన, ఆందోళన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని రామా టాకీస్ సమీపంలోని కాశ్యప్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నుంచి ప్రారంభమైన డిగ్రీ ఫైనలియర్ పరీక్షలకు ఆరుగురు విద్యార్థులు కాలేజీ ఫీజు చెల్లించలేదని హాల్‌టిక్కెట్లు రాకుండా చేసిన ఉదంతం చోటుచేసుకుంది. సాధారణంగా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల విద్యార్థులకు కళాశాల యాజమాన్యమే ఫీజులు చెల్లిస్తుంది. కాలేజీ ఫీజులతోపాటు పరీక్ష ఫీజులను విద్యార్థుల నుంచి వసూలు చేసి యూనివర్సిటీకి చెల్లిస్తారు. అయితే కశ్యప్ డిగ్రీ కాలేజీలోకొంతమంది డిగ్రీ ఫైనలియర్ పరీక్ష ఫీజు రూ.1300 చొప్పున కాలేజీ యాజమాన్యం చెల్లించలేదు. ఆఖరినిమిషంలో ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో కొంతమంది విద్యార్థులు అవస్థలు పడి అపరాధరుసుముతో చెల్లించారు. అయితే ఆరుగురు విద్యార్థులు ఫీజు చెల్లించని లేదంటూ వారికి హాల్‌టిక్కెట్లు రాకుండా పరీక్షకు దూరం చేశారని విద్యార్థులు కాలేజీ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆఖరిసంవత్సరం పరీక్ష కావడంతో ఒక విద్యాసంవత్సరంతోపాటు విద్యార్థుల భవిష్యత్‌తో యాజమాన్యం చెలగాలమాడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు దర్యాప్తు చేసి, కాలేజీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వేలల్లో ఫీజులను విద్యార్థుల నుంచి గుంజుకుంటున్న యాజమాన్యాలు, ఇలా విద్యార్థుల జీవితాలతో ఆటలాడడం సరికాదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై కాలేజీ యాజమాన్యం వివరణ, అధికారుల స్పందన తెలియాలి.

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : విశాఖపట్నంలోని ప్రముఖ సంస్థలలో వివిధ పోస్టుల భర్తీ కోసం కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 25న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో ల్యాబ్స్‌లో జూనియర్ కెమిస్ట్ ఉద్యోగాలు 200 ఖాళీలకు బీఎస్సీ/బీకాం/బిఏ అర్హత కలిగి 20 నుంచి 25 మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు రూ.22,800 జీతం ఉంటుందని తెలిపారు. పొలగోని సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ప్రాసెస్ అసిస్టెంట్ ఉద్యోగాలు సుమారు 30 ఖాళీలకు ఏదైనా డిగ్రీ, డిప్లమో, పీజీ అర్హత కలిగి, 20 నుంచి 25 మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు 12 వేలు జీతం ఉంటుందన్నారు. సీతమ్మధార స్టీల్ సిటీ సెక్యూరిటీ లిమిటెడ్ సంస్థలో టెలికాలర్ ఉద్యోగాలు 20 ఖాళీలకు ఏదైనా డిగ్రీ అర్హత కలిగి 25 ఏళ్లలోపు ఉన్న అభ్యర్థులు అర్హులని, వీరికి రూ.12 వేలు జీతం ఉంటుందని తెలిపారు. అదే సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, కంప్యూటర్ ఆపరేటర్ 40 ఖాళీలకు ఏదైనా డిగ్రీ అర్హత, 25 ఏళ్ల అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు రూ.12 వేలు జీతం ఉంటుందన్నారు.గ్లోవ్ టెక్నాలజీ సంస్థలో ఆటో క్యాడ్, డెవలపర్స్ ఉద్యోగాలు 16 ఖాళీలకు బిటెక్ (సిఎస్ఇ), ఏదైనా డిప్లమో, బీటెక్ అర్హత కలిగిన 22 నుంచి 27 సంవత్సరాల మధ్య గల అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు రూ.13,500 జీతం ఉంటుందని పేర్కొన్నారు. పేజెస్ సంస్థలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, రిలేషన్ షిప్ మేనేజ్‌మెంట్ డేటా సోర్సింగ్ కమ్యూనికేషన్ ఉద్యోగాల కోసం డిగ్రీ సైన్స్, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్ కంప్యూటర్స్ కలిగిన అభ్యర్థులు అర్హులని, వీరికి విశాఖపట్నంలో 7, హైదరాబాదులో 15 ఖాళీలకు గాను 30 ఏళ్లలోపు వారు అర్హులని, వీరికి నెలకు వైజాగ్‌లో రూ.16 వేలు, హైదరాబాదులో రూ.18 వేలు జీతం ఉంటుందన్నారు. ట్రస్ట్ సర్వీసెస్ సంస్థలో 10 ఖాళీలకు ఐటిఐ పిట్టర్, వెల్డర్, ఫ్యాబ్రికేట్ అర్హత కలిగి 18 నుంచి 48 మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు రూ.15 వేలు నుంచి రూ.25 వేలు జీతం ఉంటుందన్నారు. సువర్ణభూమి సంస్థలో గ్రైండర్స్, హెల్పర్స్, మార్కెటింగ్ మేనేజర్, టీడీ కాలర్ తదితర 20 ఖాళీలకు 18 నుంచి 36 మధ్య వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని, వీరికి నెలకు రూ.9000 నుంచి రూ.17,000 వేలు వరకు జీతం ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగా తమ వివరాలను ncs.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, అర్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

శిథిల భవనాన్ని తొలగించండి

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీలో శిథిలావస్థలో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న పాత తుపాన్ షెల్టర్ భవనాన్ని తొలగించాలని వార్డు సభ్యుడు మహంతిశ్రీను శుక్రవారం ఎంపిడిఒ రాధకు ఫిర్యాదు చేశారు. ప్రధాన వీధిలో అంగన్వాడీ, పాఠశాలలకు సమీపంలో ఉన్న ఈ భవనం వల్ల ప్రమాదం పొంచి ఉందని, ఏదైనా ఘోరం జరగకముందే తొలగిస్తే మంచిదని విన్నవించారు. అలాగే పాండ్రంగిలో కూలి పనులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామంలో ఉపాధి హామీ పనులు చేపట్టాలని కోరారు. కుర్రపల్లిలో మస్టర్లు లేకుండా ఉపాధి పనులు చేయిస్తుండడంతో కూలీలు నష్టపోయే పరిస్థితి ఉందని, దీనిపై పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

ప్రజాశక్తి - ఆరిలోవ : డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రెండో జోన్ కమిషనర్ కనకమహాలక్ష్మి కోరారు. డ్రై డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జివిఎంసి మలేరియా విభాగం ఆధ్వర్యంలో వార్డు వైసిపి ఇన్‌చార్జ్ కెల్ల సత్యనారాయణ, స్థానిక సంఘాల నేతలు, శానిటరీ, మలేరియా సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అభయ గణపతి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆరిలోవ : పెదగదిలి, సాలిపేటలోని అభయ గణపతి ఆలయం వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పెదగదిలి, చినగదిలి కొండవాలు ప్రాంతాల ప్రజలు విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యే పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, వానపల్లి గణేష్, ఇమంది శ్రీనివాస్ పర్యవేక్షించారు.

మిగులు బడ్జెట్‌కు మండల సభ ఆమోదం



బడ్జెట్ వివరాలను వెల్లడిస్తున్న ఎంపిడిఒ రాధ

ప్రజాశక్తి- పద్మనాభం : 2022-23 సవరణ, 2023-24 అంచనా బడ్జెట్‌కు మండల సభ ఆమోదం తెలిపింది. శుక్రవారం ఎంపిపి కె.రాంబాబు అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.రాధ బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టి, వివరాలను వెల్లడించారు. 2023-24 ఆర్థికసంవత్సరం అంచనా బడ్జెట్‌లో రాబడి రూ.18,48,48,756గాను, వ్యయం రూ.18,46,38,300గా చూపి, రూ.2,10,456మిగులుతో బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. 2022-23 సవరణ బడ్జెట్‌లో రూ.16,80,46,691 రాబడికి, రూ.16,66,90,734 ఖర్చు జరిగినటు పేర్కొన్నారు. సవరణ బడ్జెట్‌లో తాగునీటి అవసరాలకు రూ.8.20లక్షలు, రోడ్లు, భవనాల మరమ్మతులకు రూ.32లక్షలు, స్త్రీశిశు సంక్షేమానికి రూ.6.60లక్షలు, ఎస్‌సి, ఎస్‌టిల సంక్షేమానికిరూ.7.60లక్షలు, మండల సభ్యుల గౌరవ వేతనం, కార్యాలయ నిర్వహణ ఖర్చులకు రూ.8,37,734, జాతీయ ఉపాధిహామీ పథకానికి రూ.15.83కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. 2023-24 అంచనా బడ్జెట్‌లో వివిధ పద్దుల కింద తాగునీటి సరఫరాకు రూ.9.02లక్షలు, భవన మరమ్మతులకు రూ35.20లక్షలు, స్త్రీశిశు సంక్షేమానికి, ఎస్‌సి ప్రాంతాల అభివృద్ధికి చెరో రూ.10.50లక్షలు, ఎస్‌టిల అభివృద్ధికి రూ.4.93లక్షలు, కార్యాలయ నిర్వహణ,సభ్యుల వేతనాలు, ఇతర ఖర్చులకు రూ.16.62లక్షలను కేటాయిస్తూ అంచనా బడ్జెట్‌ను రూపొందించగా, మండల సభ ఆమోదం తెలిపింది.

చిరుధాన్యాల వినియోగంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండల ధరణి రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం భీమిలిలో చిరుధాన్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య డిపిఎం వైదేహి, ఎపిఎం, ఎల్‌హెచ్ శ్రీనివాసు, రంగారావు మాట్లాడుతూ, నిత్య ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏరియా కో ఆర్డినేటర్ కె సత్యంనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎఫ్‌పిఒ అధ్యక్ష, కార్యదర్శులు అనసూయ, విజయలక్ష్మి, కోశాధికారి సంతోషి, ఎంఎంఎస్ అధ్యక్ష కార్యదర్శులు పార్వతి, కల్యాణి, సిసిఎస్‌లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు

30న సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఏడో వార్డు టైలర్స్ కాలనీ విజయదుర్గా దేవి ఆలయ ఆవరణలో శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 30న రాములోరి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బంగారు లక్ష్మి తెలిపారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ పర్యవేక్షణలో నాగేశ్వరరావు, పార్వతి, నూకరాజు, ఉమా దంపతులచే ఉడుపు రాట మహోత్సవం నిర్వహించారు. వైసిపి అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, పసుపులేటి గోపి పాల్గొన్నారు

కంచరపాలెం : 51వ వార్డు గాంధీనగర్-2 యువసేన సంఘం ఆధ్వర్యంలో భద్రాద్రి సీతారామచంద్ర స్వామి ఆలయంలో 12వ వార్షిక వసంత నవరాత్రి మహోత్సవాలలో భాగంగా ఈ నెల 30 సీతారాముల కల్యాణం, తర్వాత అన్నసమారాధన, నిర్వహిస్తారు.

పంట నష్టాల పరిశీలన

ప్రజాశక్తి -తగరపువలస : ఇటీవల కురిసిన వర్షాలతో పంటనష్టాలపై మండలంలోని టి నగరపాలెం, తాటితూరు గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. టి నగరపాలెంలో 17 ఎకరాల్లో వరి, 28 ఎకరాల్లో మొక్క జొన్న, 5 ఎకరాల్లో చోడి, అలాగే 120 ఎకరాల్లో వరి, 155 ఎకరాల్లో మొక్క జొన్న, 4 ఎకరాల్లో చోడి పంట సాగులో ఉన్న నేపథ్యంలో వర్షాల వల్ల ఆయా పంటలకు వాటిల్లిన నష్టంపై పరిశీలన జరిపారు. విశాఖ ఏరువాక కేంద్రం శాస్త్ర వేత్త బి భవానీ, డిఆర్‌సి అసిస్టెంట్ డైరెక్టర్ చదువుల సుబ్రహ్మణ్యం, వ్యవసాయశాఖ భీమిలి డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి విజయ ప్రసాద్, మండల వ్యవసాయ శాఖ అధికారి బి శివ కోమలి, హబ్ ఎఒ శ్రీకాంత్, తాటితూరు, సింగన బంద వ్యవసాయ శాఖ సహాయకులు బి స్వాతి, ఎల్ హరీష్ ఉన్నారు.

పంటలకు ఆశించిన తెగుళ్లు

అధికారుల పరిశీలనలో వరి, చోడి పంటలకు అగ్గితెగులు, మొక్కజొన్నకు కత్తెర పురుగు ఆశించినట్లు గుర్తించామని ఎఒ బి.శివకోమలి తెలిపారు. ఆందోళన చెందాల్సిన పనిలేదని, అయితే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా : ఇంటర్ విద్యార్థి దుర్మరణం



కార్తీక్ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి- రోలుగుంట : మండలంలోని కంచుగుమ్మల ఇటుకల బట్టి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి చెందాడు. కొత్తకోట నుంచి కొంతలం వెళుతున్న ఆటో బోల్తా పడటంతో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న మజ్జి కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ ట్యాంకర్ బోల్తా : తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి -కంచరపాలెం : కంచరపాలెం జాతీయ రహదారి వద్ద పెనుప్రమాదం తప్పింది. శుక్రవారం వేకువజామున సుమారు ఒంటిగంట సమయంలో ఐఒసి నుండి ఎన్ఎడి జాతీయ రహదారి మీదుగా రాయపూర్ వెళ్తున్న గ్యాస్ ట్యాంకర్ కప్పరాడ జాతీయ రహదారి వద్ద ఎదురుగా వెళ్తున్న టిప్పర్‌ను బలంగా ఢీకొట్టి, తర్వాత సమీప విద్యుత్ స్తంభాలను, గుద్ది డివైడర్‌పైకి దూసుకెళ్లింది. అర్ధరాత్రి వేళ ప్రమాదం జరగడం అప్పుడు రోడ్డుపై ఎవరూ లేకపోవడం, అలాగే ఇన్నింటిని గుద్దుకున్నా గ్యాస్ లీక్ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న కంచరపాలెం సిఐ ఎస్.విజయకుమార్ ఘటనా స్థలానికి చేరుకొని భారీ క్రేన్ల సహాయంతో లారీని తొలగించారు. వెస్ట్ సబ్‌డివిజన్ ఎసిపి అన్నెపు నర్సింహమూర్తి, కంచరపాలెం సిఐ ఎస్.విజయ కుమార్, ట్రాఫిక్ సిఐ మళ్ల అప్పారావు ఘటన స్థానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. విద్యుత్, ఫైర్ సేఫ్టీ సిబ్బంది సహకారంతో రక్షణ చర్యలు చేపట్టారు. ప్రమాదంతో స్వల్పగాయాలైన గ్యాస్ ట్యాంకర్ డ్రైవరును వైద్యానికి ఆసుపత్రికి తరలించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-పెందుర్తి :మండలంలోని అప్పన్నపాలెం జెఎన్ఎన్‌ఆర్ఎం కాలనీలో, కిలాని శ్రీదేవి(24) అనే వివాహిత అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. మృతురాలు శ్రీదేవి తలకు గాయం ఉందని బంధువులు ఆరోపిస్తున్నారు. జివిఎంసిలో డ్రైవర్‌గా పనిచేస్తున్న శివతో శ్రీదేవికి ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఆరేళ్ల బాబు, నాలుగేళ్ల పాప ఉంది. శ్రీదేవి మృతికి కారణాలు తెలియరాలేదు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేఘాద్రి రిజర్వాయరులో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పెందుర్తి : మేఘాద్రి రిజర్వాయర్ నీటిలో ప్రమాదవశాత్తు మునిగి కంచరపాలెం ప్రాంతానికి చెందిన టి.శేఖర్. (25) గురువారం మృతి చెందాడు. కంచరపాలెం నుంచి నూకాలమ్మ పూజా సామగ్రిని రిజర్వాయర్‌లో నిమజ్జనం చేయడానికి వచ్చిన తొమ్మిది మంది యువకులు, పూజాసామగ్రి నీటిలో కలిపిన తర్వాత చూడగా శేఖర్ కనిపించలేదు. ఎంత వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గజ ఈతగాళ్ల సాయంతో గాలించగా, శుక్రవారం ఉదయం శేఖర్ మృతదేహం లభ్యమైంది.

పౌష్టికాహార ప్రాధాన్యతపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం ఎంతో అవసరమని ఎంపిడిఒ పి.వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో పౌష్టికాహార ప్రాధాన్యతపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. సదస్సుకు అధ్యక్షత వహించిన సిడిపిఒ ఎం.శ్రీదేవి మాట్లాడుతూ, వచ్చేనెల 3 వరకు జరిగే పౌష్టికాహార పక్షోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. తాళ్లవలస పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి మల్లికార్జునరావు, ఎంపిహెచ్ఇఒ రాజ్‌కుమార్, సూపర్‌వైజర్ రత్నం, అనిత, ప్రమీల పాల్గొన్నారు.

43 మందికి ఎంసిఆర్ చెప్పుల పంపిణీ

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి కల్యాణ మండపంలో 43 మందికి ఎంసిఆర్ చెప్పులను శుక్రవారం పంపిణీ చేశారు. రెడ్డిపల్లి ఉపసర్పంచ్ శిరుగుడి ఆదినారాయణ, విజయనగరం లెప్రసీ సొసైటీ, రీచ్‌మి సంస్థ డిసిడి వి.గురునాథరెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు.

నూతన వేతనాల అమలుకు ధర్నా

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాలు తక్షణం అమలు చేయాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ కోక్ ఓవెన్ విభాగంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కోక్ ఓవెన్ విభాగాధిపతికి వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ నెల రోజుల్లో కార్మికుల వేతనాలు పెంచేలా యాజమాన్యంపై ఒత్తిడి చేస్తామన్న గుర్తింపుయూనియన్, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎటువంటి చర్యలు లేవన్నారు. వేతన సవరణ కోసం క్లాజ్ 8పై అన్ని యూనియన్లతో యాజమాన్యంపై ఒత్తిడి, పోరాటం చేద్దామని సిఐటియు ప్రతిపాదించినా గుర్తింపు యూనియన్ పట్టించుకోక పోవడం దారుణమన్నారు.. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, వేతన సవరణ, పూర్తిసామర్థ్యంతో ఫ్యాక్టరీ పని చేయించడం, ఆరవ బ్యాటరీని వెంటనే ప్రారంభించడం వంటి ప్రధాన డిమాండ్లను నెరవేర్చకుంటే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. డిప్యూటీ జనరల్ సెక్రటరీ టివికె. రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి. దాసు, జనరల్ సెక్రటరీ యూరామస్వామి, బి.అప్పారావు, డివిఆర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి. నూకరాజు, సిఎఫ్‌టియూఐ యూనియన్ ప్రెసిడెంట్ కె. ప్రకాశ్‌రావు, జి. పుల్లారావు, ఎస్‌కె. మొహియిద్దీన్, హనుమంతరావు, కె. ఆనందకుమార్, ఎస్. దేముడు నాయుడు, పి. శ్రీనివాసరావు, కె. రామశేఖర్, బి.కన్నబాబు, ఎస్ఎన్. మూర్తి, కెసిహెచ్. నాయుడు, ఎఎల్. కాంతారావు, ఎస్. మహేషు, డిఎం. సాహు, ధనుంజయ్, వై.వేణు, బి. కేశవేంద్ర, జి.కృష్ణ, కె.ఎల్ఎం. నాయుడు, ఎర్రయ్య, ఎం.ప్రకాష్, ఎం. కుమార్‌స్వామి వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు.


సిఐటియు ఆధ్వర్యాన వినతిపత్రం ఇస్తున్న కార్మిక నేతలు

31న మహాధర్నాను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న సిఐటియు నేత రమణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : పెండింగ్ డిఎ ఎరియర్స్ సాధనకు ఈనెల 31న ఇడి వర్క్స్ వద్ద చేపట్టే మహాధర్నా లో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉక్కునగరంలో నిర్వహించిన కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న వివి రమణ మాట్లాడుతూ, యాజమాన్యం, కాంట్రాక్టర్లు కుమ్మక్కై 2021 ఏప్రిల్ నుంచి కాంట్రాక్టు కార్మికులకు రావాల్సిన డిఎ ఎరియర్స్ చెల్లించడం లేదన్నారు. ఆరేళ్లుగా వేతనపెంపు చర్యలు చేపట్టడం లేదని,దీంతో కాంట్రాక్టు కార్మికుల కుటుంబాల జీవనం దుర్భరమౌతోందన్నారు ఎన్‌జెసిఎస్‌లో జీతభత్యాలు పెంపుపై ఎటువంటి చర్యలు లేని పరిస్థితుల్లో సమస్యల పరిష్కారానికి ఈనెల 31న చేపట్టే మహాధర్నాలో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. గంగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వై.శివ, బి. శీను, రామలక్ష్మి, అప్పారావు, వర, రాము, దానిమ్మ లక్ష్మి, రవణమ్మ.పాల్గొన్నారు.

వేములవలస మార్కెట్ వేలం ఖరారు

ప్రజాశక్తి -ఆనందపురం: వేములవలస మహాత్మాగాంధీ రోజువారి మార్కెట్ ఆశీలు వసూలుకు వేలంపాట శుక్రవారం నిర్వహించారు. డిపిఒ జి.అప్పలరాజు, ఇఒపిఆర్‌డి పివిఎన్‌జె. ఆంజనేయులు గ్రామ కార్యదర్శి పి నర్సింగరావు ఆధ్వర్యంలో సీల్డ్ కవర్, బహిరంగ వేలంపాట నిర్వహించారు సీల్డ్ కవర్లు ఓపెన్ చేయగా, వేములవలస గ్రామానికి చెందిన పతివాడ పుష్పవతి అత్యధికంగా రూ.1.67కోట్లకు హెచ్చుపాటదారుగా గుర్తించి వేలం ఖరారు చేశారు. గతేడాది రూ.1.26కోట్లకు వేలం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ లంక కొండమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు గడువు పెంచాలి

ప్రజాశక్తి -గాజువాక : ఎపిపిఎస్‌సి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల సన్నద్ధతకు ఇపుడిచ్చిన సమయంలో 85రోజులు చాలదని, మరో మూడు నెలల గడువు పెంచాలని విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ఎస్.రతన్‌కాంత్ డిమాండ్ చేశారు.
శుక్రవారం గాజువాక పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయిన అభ్యర్థులు మెయిన్స్‌లో ఏడు పేపర్లు ప్రిపేర్ కావడానికి ఇపుడిచ్చిన సమయం సరిపోదన్నారు. ఆయా విషయాల్లో లోతైన జ్ఞానం, విశ్లేషణకు మరింత సమయమివ్వాలని కోరారు. కార్యక్రమంలో వంశీ, అనిల్, కసిపల్లి శ్రీను, శ్రీను, లోకేష్ పాల్గొన్నారు.


కేకు కట్ చేస్తున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు పల్లా

టిడిపి విజయోత్సవం

ప్రజాశక్తి -గాజువాక : ఎమ్మెల్సీ ఎన్నికల విజయోత్సవ సంబరాలను గాజువాక టిడిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రానున్న రోజుల్లో టిడిపి, చంద్రబాబు ప్రభంజనాన్ని ఏ దుష్టశక్తి అడ్డుకోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి ప్రభంజనంలో వైసిపి కొట్టుకుపోవడం ఖాయమన్నారు. రాష్ట్ర పార్టీ కార్యదర్శి కార్పొరేటర్ బొండా జగన్, జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు. కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు. మొల్ల ముత్యాలనాయుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు. పులి వెంకటరమణారెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటరాజు, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు విల్లా రామ్మోహన్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు. టిఎన్ఎస్ అధ్యక్షులు ఎస్ రతన్ కాంత్, నామాల పెంటయ్య. పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -ములగాడ: జి 20 దేశాల సదస్సు నేపథ్యంలో దేశవ్యాప్తంగా వివిధ వర్సిటీల్లో మారిటిగానే ఆంధ్రాయూనివర్సిటీలో నిర్వహించిన పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. విదేశాంగ విధానంపై సెమినార్‌లో కాలేజీ విద్యార్థులు సత్తా చూపగా, వ్యాసరచన పోటీలో హర్షితరాణి ప్రతిభ కనబరిచి ఎయు విసి ప్రసాదరెడ్డి నుంచి బహుమతులను అందుకుంది. యూనివర్సిటీ స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కాలేజీ ప్రిన్సిపల్ సిస్టర్ ప్రేమకుమారి శుక్రవారం అభినందించి, విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. పొలిటిక్స్ లెక్చరర్ ఇపిఎస్.భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి పాల్గొన్నారు.

పేదలకు చేయూతనివ్వాలి

ప్రజాశక్తి -ములగాడ: పేదలకు అన్నివిధాలా చేయూతనిచ్చి ఆదుకోవాలని నాయీ బ్రాహ్మణ సంఘం జెవిసి వైస్ ప్రెసిడెంట్ కోరిబిల్లి కోటేశ్వరరావు అన్నారు. పేద నాయీ బ్రాహ్మణ వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గౌరవ అధ్యక్షులు పుల్లేటికుర్తి సూర్యారావు, అధ్యక్షులు గోల్కొండ రామకృష్ణ, కోశాధికారి కేసనకుర్తి మల్లేశ్వరరావు, సెక్రెటరీ ఉప్పలపు లోవరాజు, వైస్ ప్రెసిడెంట్ మంత్రపు సింహచలం, గౌరవ సలహాదారులు ఉప్పలపు. శివకుమార్, కాగుపాటి అప్పారావు, కోడూరు. రాంబాబు, నాగేశ్వర రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్ పాల్గొన్నారు.

27న చిరుధాన్యాలపై అవగాహన

పద్మశ్రీ డాక్టర్ ఖాదర్‌వలీకి పౌర సత్కారం

ప్రజాశక్తి- సీతమ్మధార : మిల్లెట్ ఆహారంపై మీ ప్రశ్నకు పద్మశ్రీ డాక్టర్ ఖాదర్‌వల్లి జవాబులు' అనే కార్యక్రమాన్ని ఈనెల 27న సాయంత్రం నాలుగు గంటలకు మద్దిలపాలెం కళాభారతిలో నిర్వహిస్తున్నామని గోఆధారిత ప్రకృతి పంటల రైతు సంఘం చైర్మన్ పిఎల్ఎన్ రాజు తెలిపారు శుక్రవారం పౌర గ్రంథాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, మొదట్లో ఖాదర్‌వలీ ప్రసంగం, చివరగా పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలికి పౌర సన్మానం ఉంటుందన్నారు చిరుధాన్యాల ఆహారం ప్రేమికులంతా తరలిరావాలని కోరారు. కార్యదర్శి జిఎస్ఎన్ రాజు, సీనియర్ జర్నలిస్ట్ ఎం యుగంధర్‌రెడ్డి, సత్య నాచురల్స్ అధినేత మధుసూదన్ రెడ్డి, ప్రకృతి పంటల రైతు సిహెచ్ రిషి, సంఘం నగర అధ్యక్షుడు దాట్ల వర్మ, గ్రీన్ క్లైమేట్ టీం ప్రతినిధి జెవి.రత్నం పాల్గొన్నారు. 27న సమావేశానికి వచ్చే వారందరికీ సత్యా నేచురల్స్ ఉచిత ఆహార కూపన్లు ఇస్తారన్నారు.

ఉత్తమ ఎల్‌టి సూపర్‌వైజర్‌గా శ్రీనివాస్


అవార్డు స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా అగనంపూడి వైద్యవిధాన పరిషత్ ఎల్‌టి ఎం.శ్రీనివాసరావుకు జిల్లాస్థాయిలో ఉత్తమ ల్యాబ్ టెక్నిషియన్ సూపర్‌వైజర్ అవార్డు దక్కింది. శుక్రవారం డిఎంహెచ్ఓ డాక్టర్ జగదీశ్వరరావు నుంచి అవార్డును శ్రీనివాస్‌స్వీకరించారు.
వరల్డ్ టిబి సందర్భంగా అగనంపూడి హాస్పిటల్ కి చెందిన ఎం శ్రీనివాసరావు కు బెస్ట్ ల్యాబ్ టెక్నీషియన్సూపర్వైజర్ డిస్ట్రిక్ట్ హెల్త్ అండ్ మెడికల్ ఆఫీసర్ చేతుల మీదుగా శుక్రవారం అవార్డు అందుకున్నారు.. డిఎంహెచ్ఓ జగదీశ్వర రావు చేతుల మీదగా అవార్డును అందుకున్నారు.

యుపిహెచ్‌సి వైద్యాధికారికి ప్రశంసలు

భీమునిపట్నం :ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్ అఖిలప్రియ, ఎగువపేట వార్డు సచివాలయం హెల్త్ సెక్రెటరీ నిమ్మకాయల వెంకట పద్మకు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందాయి క్షయవ్యాధి నివారణలో చేసిన కృషికి గుర్తింపుగా జిల్లా పరిషత్ భవనంలో డిఎంహెచ్ఓ డాక్టర్ సూర్యనారాయణ, జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి అవార్డులు అందించారు.

'బాధితులకు పరిహారం'పై శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులకు సంస్థ భవనంలో 'బాధితులకు పరిహారం' అంశంపై శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు జిల్లా న్యాయ ప్రాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తాల గోపి సదస్సు ప్రారంభించి మాట్లాడుతూ,. అత్యాచారానికి, యాసిడ్‌దాడికి ఇతరత్రా వేధింపులకు గురైన బాధితులకు చట్టంలో ఉన్న నిబంధనల మేరకు పరిహారం అందించేందుకు కృషి చేయాలన్నారు.ఈసందర్భంగా బాలల న్యాయచట్టాలు, బాధితులకు న్యాయ పరిహారం, మోటార్ వాహన చట్టం, తదితర అంశాలపై న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కెవి.బులికృష్ణ, సీనియర్ న్యాయవాది కుప్పిలి మురళీధర్, ఆర్ శ్రీనివాసరావు వివరించారు.

సామాజిక భవన నిర్మాణానికి లైన్ క్లియర్!


పరిశీలిస్తున్న జివిఎంసి, విఎంఆర్‌డిఎ, రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం :మూడో వార్డు కృష్ణాకాలనీ వద్ద గెయిల్ సిఎస్ఆర్ నిధులు రూ.మూడు కోట్లతో నిర్మించ తలపెట్టిన బహుళ ప్రయోజన సామాజిక భవన నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయి.ఇక్కడ మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మించాలన్న ప్రతిపాదన ఉన్నందున, సామాజిక భవనానికి ఆటంకం ఉంటుందేమోనని సంబంధిత అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. రోడ్డునిర్మాణం వల్ల సామాజిక భవనానికి ఎటువంటి ఆటంకం ఉండదనినిర్ధారణకు వచ్చినట్లు జివిఎంసి కమిషనర్ రాజాబాబు ఆదేశాలతో పరిశీలనకు వచ్చిన అధికారులు వెల్లడించారు. తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్, మండల సర్వేయర్ రమేష్, విఎంఆర్‌డిఎ సహాయ ప్రణాళిక అధికారి యూన్నీ, స్థానిక అసిస్టెంట్ సిటీ ప్లానర్ దవళ శ్రీనివాసరావు, ఇఇ మత్య రాజు, ఎఇ, సుమన్ పాల్గొన్నారు.

స్టార్ పినాకిల్‌లో 500 మంది చిన్నారులకు

విజయవంతంగా గుండె ఆపరేషన్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ హెల్త్‌సిటీ స్టార్ పినాకిల్ ఆసుపత్రిలోని హార్ట్ పీడియాట్రిక్ కేర్ యూనిట్ ద్వారా 500 మందికి పైగా చిన్నారుల గుండెకు శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి ఎండి. డాక్టర్ కె.కల్యాణ చక్రవర్తి తెలిపారు. శుక్రవారం స్టార్ పినాకిల్‌లో చిన్నారుల కోసం ప్రత్యేక కార్డియాక్ యూనిట్‌ను ప్రప్రథమంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో హృద్రోగ చిన్నారులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వంద మందికి వైద్యపరీక్షలు చేశారు.
ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో కార్డియాలజిస్టు డాక్టర్ జివి.రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రాతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రాంత హృద్రోగ చిన్నారులకు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో స్టార్ పినాకిల్‌లో ప్రత్యేక యూనిట్ ప్రారంభించామన్నారు.పీడియాట్రిక్ హార్ట్ సర్జన్ ఎల్.విజయ్ మాట్లాడుతూ గుండెకు రంధ్రం పడడం, గుండె కొట్టుకోవడంలో వ్యత్యాసం, కవాటాల్లో ఇబ్బందులు, బ్లూబేబీ సిండ్రోమ్ వంటి పిల్లల్లో వచ్చే గుండె సంబంధిత సమస్యలకు త్వరితగతిన చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చన్నారు. స్టార్‌పినాకిల్‌లో చిన్నారుల గుండె ఆపరేషన్లకు అవసరమయ్యే అత్యాధునిక నియోనాటోల్ వెంటిలేటర్లు, పీడియాట్రిక్ బాసినెటర్లు, 2డి ఎకో ప్రాబ్స్, టిఇఇ ప్రాబ్స్ పరికరాలు వంటివి అందుబాటులో ఉన్నాయన్నారు. పీడియాట్రిక్ ఇంటర్నల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ కార్డియాక్ వైద్యనిపుణులతోపాటు ప్రత్యేక శిక్షణ పొందిన పారా మెడికల్ సిబ్బందితో రోగులకు సేవలు అందిస్తున్నామన్నారు. డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ చిన్నారుల్లో గుండె వ్యాధులకు శస్త్రచికిత్స తరువాత పూర్తిగా కోలుకునే వరకు వైద్యబృందం ప్రత్యేక పర్యవేక్షణ ఉండడంతో ఆపరేషన్ చేసిన తర్వాత కోలుకున్న చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేస్తున్నారన్నారు.


మాట్లాడుతున్న స్టార్ పినాకిల్ పీడియాట్రిక్ హార్ట్ కేర్ వైద్యులు

రికార్డులు తారుమారు చేసి గిరిజనులకు అన్యాయం

★ తప్పుడు నివేదికలు ఇచ్చిన రెవెన్యూ అధికారులు
★ కలెక్టర్ స్వయంగా పరిశీలించాలని బాధిత గిరిజనుల ఆందోళన


మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ


ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా, చీడికాడ మండలం, కోనాం గ్రామం శివారు కొత్తవీధి సర్వే నెంబర్ 289లో కొన్ని దశాబ్దాలుగా 16 గిరిజన కుటుంబాలు సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించిన రికార్డులను గత ఏడాది జూన్ 13న నిబంధనలకు విరుద్ధంగా అప్పటి తహశీల్దారు తారుమారు చేసి గిరిజనులకు అన్యాయం చేశారని అఖిలభారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పిఎస్ అజయ్ కుమార్ ఆరోపించారు. ఈ వాస్తవాలు తెలుసుకునేందుకు కలెక్టర్ పర్యటించాలని కోరుతూ శుక్రవారం స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్‌లో బాధిత గిరిజనులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు జరిగిన అన్యాయంపై విజయవాడ భూమిశిస్తు కమిషనర్‌కు విన్నవించగా, మొత్తం భూమిని ఎంజాయ్మెంట్ సర్వే చేయాలని, అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్‌ను స్వయంగా వెళ్లి విచారణ చేసి నివేదిక అందించాలని ఆయన ఆదేశించారని తెలిపారు. కాని నేటి వరకు జెసి తనిఖీ చేయలేదన్నారు. ఇద్దరు ఆర్డీవోలు సదరు భూములను పరిశీలించి సాగులో గిరిజనులు ఉన్నట్టు కళ్ళతో చూశారని, అయితే నోటితో చెప్పలేకపోతున్నారని పేర్కొన్నారు. మానవ హక్కుల వేదిక ప్రతినిధి వివిఎస్ కృష్ణ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ తమ బందం గత ఏడాది ఆగస్టు 30న గ్రామాన్ని పరిశీలించి వాస్తవాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని, అయితే కలెక్టర్ తమ దిగువ సిబ్బంది ఇచ్చిన నివేదికపై ఆధారపడినట్టు స్పష్టమవుతుందని పేర్కొన్నారు. అధికార పార్టీ మంత్రులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై రికార్డులు తారుమారు చేసినట్లు తెలిపారు. సిపిఐ నాయకులు ఆర్ అప్పలరాజు, కాంగ్రెస్ నాయకులు ఐఆర్ గంగాధర్ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు నియోజకవర్గంలో ఆదివాసీలకు అన్యాయం జరుగుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆదివాసీలు చేసే న్యాయ పోరాటానికి తాము ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని చెప్పారు.

గిరిజనులకు ఎటువంటి హక్కులూ లేవు : జెసి


మాట్లాడుతున్న జెసి

అనకాపల్లి : చీడికాడ మండలం కోనాం గ్రామం శివారు కొత్తపేట గ్రామం సర్వేనెంబర్ 289/1లో 29 ఎకరాల 86 సెంట్లు భూమి ప్రైవేటు వ్యక్తులకు చెందిన జిరాయితీ భూమని, ఈ భూముల్లో సాగు చేస్తున్న గిరిజనులకు ఎటువంటి హక్కులు, ఆధారాలు లేవని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి వెల్లడించారు. శుక్రవారం తన ఛాంబర్లో జెసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ భూమిని తాము దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నామని, తమ పేర రెవెన్యూ రికార్డుల్లో, వెబ్ లాండ్‌లో నమోదు చేసి పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇవ్వాలని కొంతమంది గిరిజనులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తు చేసిన వారు కూడా స్థానికులు కాదని గ్రామంలో జరిగిన బహిరంగ విచారణలో తేలిందన్నారు. ఈ భూమిని పంట ఫల సాయం భాగస్వామ్యం నిమిత్తం కొందరు గిరిజనులకు సదరు భూమి యజమాని ఇవ్వడం జరిగిందని, అయితే ఆ భూములను ఆరుగురు వ్యక్తులు కొనుగోలు చేసినట్టు, పట్టాదార్ పాస్ పుస్తకాలు కూడా మంజూరైనట్టు తమ విచారణలో తేలిందని, వీరికి షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు.



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు ముత్యాలనాయుడు

5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఏప్రిల్ 5న జరుగు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయిని బాబు, సహాయ కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని ఆనందపురం గ్రామంలో శుక్రవారం ముఠా కార్మికులతో సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక, వ్యవసాయ కార్మిక, రైతు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, మార్కెట్ సౌకర్యం, కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, కార్మికులు గురు గుమ్మయ్య, భాజంకి రమేష్, వేచలపు ఈశ్వరరావు, కర్రి కన్నయ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో డిప్యూటీ డిఇఒ తనిఖీలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ, దేవరాపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను డిప్యూటీ డిఇఒ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఆయా పాఠశాలలో ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. 8వ తరగతి విద్యార్థులు బైజుస్ టాబుల ద్వారా ఎంత సమయం చూస్తున్నారు, ఎలా ట్యాబ్‌లను ఉపయోగిస్తున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కైరళీ ఇంగ్లీష్ మీడియం స్కూలును పరిశీలించారు. అనంతరం పదవ తరగతి పరీక్షలు నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరుపై సమీక్ష జరిపారు. ఆయన వెంట ఎంఇఒ సిహెచ్ రవీంద్రబాబు ఉన్నారు.

వర్షంతో చెరుకు నాట్లకు నష్టం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఐదు రోజులగా కురుస్తున్న వర్షాలతో చెరకు నాట్లకు నష్టం వాటిలిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరుకు దవ్వ నాటిన మడులలో వర్షం నీరు నిలిచిపోయిందని, దీని వల్ల దవ్వ పులిసిపోయి, నాట్లు దెబ్బతింటాయని తెలిపారు. నీరు బయటికి వెళ్లే అవకాశం లేకుండా ఉందన్నారు. దుక్కులు దున్నటానికి, చెరుకుదవ్వ కొనుగోలుకు, కూలీలకు అధిక మొత్తంలో వెచ్చించామని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తిరిగి నాట్లు వేయటానికి చెరుకు విత్తనం ఉచితంగా సరఫరా చేయాలని రైతులు కోరారు.

భగత్ సింగ్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-రాంబిల్లి : స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్క కృషి చేయాలని సిఐటియు, డివైఎఫ్ఐ, మత్స్యకార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 92వ వర్ధంతి శుక్రవారం మండలంలోని కొత్తపట్నం గ్రామంలో ఆయా సంఘాల ఆధ్వర్యాన నిర్వహించారు. భగత్ సింగ్ విగ్రహానికి చోడిపల్లి గంగరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం, అందరికీ విద్య, ఉపాధి, కూడు, గుడ్డ, సమానత్వం కోసం కుల మతాలకు అతీతంగా పోరాడిన వీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు. నాటి స్వాతంత్ర్య ఫలాలు నేడు దేశ పాలకులు కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టి దేశాన్ని తెగ నమ్ముతున్నారని విమర్శించారు. నేటి దేశ ప్రజలు మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ధోని అప్పలరాజు, నూకన్న, నూకరాజు, నారాయణ రావు పాల్గొన్నారు.


భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ముగిసిన గోవాడ సుగర్స్ క్రషింగ్

ప్రజాశక్తి-చోడవరం

గోవాడ చక్కెర కర్మాగారం క్రషింగ్ శుక్రవారం ఉదయం ముగిసింది. రెండు లక్షల 20 వేల టన్నులు గానుగాట ఆడి సుమారు 1,80,000 బస్తాలు పంచదార ఉత్పత్తి సాధించింది. గత ఏడాది డిసెంబర్ 19న క్రషింగ్ లంచనంగా ప్రారంభమైంది. మొదట్లో ఇబ్బందులు ఎదురై ఫ్యాక్టరీ క్రషింగుకు అంతరాయం ఏర్పడింది. సాంకేతిక లోపాలు తలెత్తి నిత్యం ఇబ్బందులు కలుగుతుండేవి. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టకుండా ఫ్యాక్టరీ మొదలు పెట్టడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. గత ఏడాది రెండు లక్షల 95 వేల టన్నులు క్రషింగ్ జరిపింది. ఈ ఏడాది 75000 తగ్గి 2,20,000 తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఫ్యాక్టరీ ప్రారంభం నుండి ఇప్పటి వరకు 15 వేల టన్నులకు మినహా రైతులకు బట్వాడా చేయలేదు. దీంతో చెరుకు రైతులు చాలావరకు విజయనగరం జిల్లాలో ఉన్న ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీకి చెరుకును తరలించారు. ఫ్యాక్టరీ ముగిసిన తర్వాత అయినా తమకు చెల్లింపులు జరుగుతాయని రైతులు ఎదురుచూస్తున్నారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ముషిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఏప్రిల్ 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో వారికి వీడ్కోలు పలుకుతూ మిగిలిన తరగతి విద్యార్థిని విద్యార్థులు డ్యాన్సులు వేస్తూ కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఉదయభాస్కర్ మాట్లాడుతూ పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి డ్రెయినేజీతో ఆవఖండ భూములకు నష్టం

ప్రజాశక్తి- అనకాపల్లి : జీవీఎంసీ డ్రెయినేజీతో నీటితో ఆవఖండం భూములకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం ఉపాధ్యక్షులు విల్లూరి పైడారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి శుక్రవారం ఆవ ఖండం భూములను పరిశీలించారు. ఈ భూముల్లో ప్రతి ఏటా సుమారు 300 ఎకరాల్లో టమోటా పంట, ఇతర ఉద్యాన పంటలు సాగు చేస్తారని, వర్షాలతో పాటు జీవీఎంసీ డ్రైనేజీ వాటర్ ఈ భూములకు చేరడంతో ప్రతి ఏటా సుమారు కోటిన్నర రూపాయలు రైతులు నష్టపోతున్నారని తెలిపారు. పంట నష్టం పై అంచనా వేసి ప్రభుత్వానికి అందజేయనున్నట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి రంగాచారి, మండల ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్, లావణ్య తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కొణతాల గణేష్, మల్ల శ్రీను, రైతులు పాల్గొన్నారు.

పంట నష్టంపై ఆరా


దెబ్బతిన్న నువ్వు పంటను పరిశీలిస్తున్న మోహనరావు

ప్రజాశక్తి -మునగపాక రూరల్

అకాల వర్షాల కారణంగా మండలంలోని మునగపాక, చూచుకొండ గణపర్తి వాడ్రాపల్లి గ్రామాలలో నీట మునిగిన నువ్వు చేలు, పొద్దుతిరుగుడు పంటలను శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు పరిశీలించారు. స్థానిక రైతులతో సమావేశం నిర్వహించారు. పంట నష్టంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షానికి పంటలు ఎంతవరకు నీట మునిగాయి? ఎన్ని ఎకరాలలో నష్టం వాటిల్లిందో తెలిపే నివేదిక సమర్పించాలని స్థానిక విఎఎలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జోష్నా కుమారి, విఎఎలు నవ్య శ్రీ, శ్వేతా మీనన్, తులసి, ఏఈఓ లక్ష్మి, రైతులు పెంటకోట రఘురాం, మద్దాల నర్సింగరావు, పెంటకోట ఆదిరత్నం నాయుడు, రాము పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలో అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని యలమంచిలి వ్యవసాయ ఏడి రవిప్రకాష్ అన్నారు. మండలంలోని సోమలింగపాలెం గ్రామం శుక్రవారం ఆయన పర్యటించి వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలించారు. పూతదశలోను, కాయ దశలోను ఉన్న నువ్వుపంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. నువ్వు పంట రైతులకు పలు సూచనలు చేశారు. నిల్వనీరు తీసేసి, ఎకరాకు 18 కేజీల యూరియా చల్లాలని సూచించారు. గింజదశ పంటకు 19:19:19 (పొటాష్) 5 గ్రాములు లీటరుకు కలిపి మొక్కలు తడిచేలా పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎ స్వాతి, లలిత, ఏఇఓ దేవుడు పాల్గొన్నారు.

'సింహాద్రి'లో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సింహాద్రి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫస్ట్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు సత్యనారాయణమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి బాల మురళీకృష్ణ, నారపాడు సర్పంచ్ మామిడి శంకర్రావు, జీవివి రమేష్ పాల్గొన్నారు.

సహకార సొసైటీ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల గ్రామంలో శుక్రవారం మహిళా సహకార సొసైటీని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు ఆధ్వర్యంలో సహకార సొసైటీ అధ్యక్షురాలు పడాల శారద, పాలకవర్గ సభ్యుల చేతుల మీదుగా సొసైటీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు పడాల గణపతి రావు, వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్న, ఆర్టీసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో షూటింగ్

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక నూకంబిక ఆలయంలో శుక్రవారం డైరెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే షార్ట్ ఫిలిం షూటింగ్ జరిగింది. మాజీమంత్రి దాడి వీరభద్రరావు పూజా కార్యక్రమం చేసి ప్రారంభించారు. శ్రీనూకాంబిక అమ్మవారి ప్రధాన ఇతిహాసంగా తీస్తున్న ఈ షార్ట్ ఫిలిం అందరూ ఆదరించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్ల సురేంద్ర, ఆలయ ఈవో చంద్రశేఖర్, మల్ల రాజా, పివి రమణ పాల్గొన్నారు.

ఉపాధి హామీపై సోషల్ ఆడిట్

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని 2021-2022 ఆర్థిక సంవత్సరంనకు సంబందించిన ఉపాధి హామీ పథకంలో జరిగిన అన్ని రకాల పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతుందని ఎం.పీ.డీ.వో రమేష్ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం వేతనాలు, మెటీరియల్ రూపంలో రూ.10 కోట్ల 30 లక్షలు పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి- కె.కోటపాడు

జిల్లాలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నట్లు ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడమే కాకుండా ఆక్రమణదారులపై పోలీస్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పాతవలస, సూదివలస గ్రామాల్లో ఆయన పర్యటించారు. పాతవలస హైస్కూల్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని హెచ్ఎంను ఆదేశించారు. నాడు-నేడు ద్వారా నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతు భరోసా కేంద్రంలో ఉన్న రికార్డులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఇటీవల వచ్చిన తుపాను వల్ల మామిడి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కూరగాయలు నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజ్ మంజూరు చేయాలని కోరగా రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా తీర్మానం చేసి తనకు పంపాలని ఉద్యానవన శాఖ సహాయకురాలు గజ్జి అనూషను ఆదేశించారు. అనంతరం సూదివలసలో నిర్మాణం పూర్తి చేసుకున్న సచివాలయ భవనాన్ని పరిశీలించారు. సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని ఎటువంటి వివాదాలు లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులందరి సమక్షంలో భూ సర్వే నిర్వహించాలని తహశీల్దారు రమేష్ బాబును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శచీదేవి, ఏవో సోమశేఖర్, ఎంఈఓ మధు మూర్తి, ఐసిడిఎస్ ఏపీవో మంగతాయారు, ఎంపీటీసీ వర్రి రామునాయుడు, సర్పంచులు జామి శ్రవణ్, ఆదిరెడ్డి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్ని సంఘాలూ ఆడిట్ నిర్వహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

పాలకవర్గాలపై జవాబుదారీతనం ఉండాలంటే అన్ని సంఘాలు విధిగా ఆడిట్లు నిర్వహించుకోవాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ రావు అన్నారు. స్థానిక దొడ్డి రాము నాయుడు కార్మిక కర్షక నిలయంలో శుక్రవారం గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ లేకుండానే నష్టపరిహారం అందించేదని, ప్రస్తుతం ట్యాగ్లు వేసుకున్న వారికి మాత్రమే ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో గొర్రెలు మేకలకు డీ వార్మింగ్ మందులు పంపిణీ చేస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గొర్రెలు మేకల పెంపకం దారుల యూనియన్ జిల్లా చైర్మన్ గంట శ్రీరామ్ మాట్లాడుతూ సంఘ సభ్యులకు 50 శాతం రాయితీపై రుణాలు అందించాలన్నారు. 100 శాతం ఎన్సీడీసీ రుణాలు చెల్లించినప్పటికీ రావలసిన నిధులు విడుదల చేయకపోవడం దుర్మార్గమన్నారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనుబాబు గొర్రెలు మేకల పెంపకం దారులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా వైస్ చైర్మన్ సబ్బి శ్రీనివాసరావు, డైరెక్టర్లు పినబోయిన అప్పారావు, ఉరిగిటి శివ సూర్యనారాయణ, గోకాడ దేవుడు నాయుడు, బొట్ట వరహాలు, పల్లా సత్యారావు, వేదురు అప్పారావు, పల్లా శ్రీరాములు, మొకర అప్పలనాయుడు, ముచ్చ రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ అధికారి ప్రసాదరావు

సింహాచలంనాయుడు మృతి కారకులను అరెస్టు చేయాలి



ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

తమ కుమారుడు జామి సింహాచలం నాయుడు మృతికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని మృతుని తల్లిదండ్రులు జామి సింహాచలమ్మ, జామి గౌరునాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం మతుడు కుటుంబ సభ్యులు, స్థానికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గౌరునాయుడు మాట్లాడుతూ దేవరాపల్లికి చెందిన కోరుపోలు సన్యాసి నాయుడు కూమార్తె సరోజిని, తమ కుమారుడు సింహాచలం నాయుడు ప్రేమించుకుంటున్నారని తెలిపారు. ఈ విషయం సరోజిని అన్నయ్యకు తెలిసి తమ కుమారుడిని తీవ్రంగా కొట్టడంతో పాటు పెద్దలు సమక్షంలో పంచాయతీ జరిపారని పేర్కొన్నారు. నాటి నుండి తమ కుమారుడు దూరంగా ఉన్నాడన్నారు. ఇంతలో సరోజినికి పెళ్లి కుదరడంతో తమ కుమారుడు ఎక్కడ అడ్డం పడతాడోనని అనుమానంతో సరోజిని అన్నయ్య నరసింహమూర్తి ఈ నెల 18న శనివారం రాత్రి సింహాచలం నాయుడును ఎలాగైనా చెంపేస్తానని గ్రామంలో చెప్పుకుంటూ తిరిగాడని, ఇంతలోనే ఆదివారం తెల్లవారు జామున శారదా నది ఒడ్డు చెట్టుకు ఉరివేయబడి తమ కుమారుడు చనిపోయాడని తెలిపారు. దీనిపై పోలీసులకు రెండు సార్లు ఫిర్యాదు చేసినా దోషులను కనీసం పిలిపించి మాట్లాడలేదన్నారు. కోరుపోలు నరసింహమూర్తి, ఆయన తండ్రి సన్యాసి నాయుడు, వారి కుటుంబ సభ్యులు హత్య చేసి, ఆత్మహత్యగా మార్చారని, వారిని అరెస్టు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బండారు అప్పలనాయుడు, చొక్కాకుల దేముళ్ళు, చొక్కాకుల అప్పారావు, అల్లు నరసింహమూర్తి, జామి శ్రీను, జామి చిన్నమనాయుడు, ట్రాక్టర్ డ్రైవర్లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11.30 గంటలకు జరుగుతుందని చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి తెలిపారు. మున్సిపల్ అధికార్లు, సంబంధిత అధికార్లు హాజరు కావలసిందిగా ఆమె సమావేశపు నోటీసులో పేర్కొన్నారు.

దళిత యువకుడిని హత్య చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవృక్షం గ్రామంలో దళిత యువకుడు నడిపల్లి రాముని మార్చి 21వ తేదీ రాత్రి దాడిచేసి హత్యచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ మండల గౌరవ అధ్యక్షులు దువ్వు దుర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామ దేవత జాతరకు వెళ్ళిన దళిత యువకులపై కుల దురహంకారంతో దాడి చేయడమే గాకుండా, దళిత పేటలోకి వెళ్ళి ఇళ్లలో ఉన్నవారిపై దాడి చేసి కొంతమంది దళితులను గాయపరిచారని ఆరోపించారు. రాము కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని, రెండు ఎకరాలు భూమి, ఉద్యోగం, ఇంటి స్థలం, ఇల్లు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాయపడిన బాధితులకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు.

టిడిపి విజయోత్సవం

ప్రజాశక్తి- కశింకోట : ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ గెలుపొందిన నేపథ్యంలో గురువారం రాత్రి కశింకోట లో తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని తాళ్లపాలెం జంక్షన్‌లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, సిదిరెడ్డి శ్రీనివాసరావు, తాకాశి కృష్ణ, బొడ్డేడ బాలాజీ, దాడి నాగరాజు పాల్గొన్నారు.

కలశ ప్రతిష్ట మహోత్సవం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని తేగాడ రామాలయంలో పసిడి కలశ ప్రతిష్ట మహోత్సవం గ్రామ సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మ, వైసిపి నాయకులు నీటిపల్లి దివాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం దివాకర్ హేమలత, పరవాడ గోవిందరావు విజయలక్ష్మి, పరవాడ రవి మణి, మాకాల చిరంజీవి జ్యోతి దంపతులు చేతుల మీదుగా కలశ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తుంపాల వెంకట సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నీటిపల్లి రాజేశ్వరరావు, గొర్లి అప్పారావు, సరసపల్లి అప్పారావు, జనపరెడ్డి వెంకటరమణ అద్దేపల్లి సుంకర శివ, సుంకర బాలాజీ, పరవాడ దత్తాత్రేయ, తూరుబిల్లి శ్రీనివాసు, తుంపాల కేశవరావు పాల్గొన్నారు.

మైహోం ఆధ్వర్యాన ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : మండలంలోని ములకలపల్లి మైహోమ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో పులపర్తి, పురుషోత్తపురం గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా కంటి పరీక్షలు చేసి కళ్ళజోడు అవసరం ఉన్న వారిని గుర్తించి కళ్ళజోళ్ళు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు మెడికల్ ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ (వర్క్స్) వి.హెచ్.చౌదరి, సీనియర్ డిజిఎం ఎల్. శ్రీనివాసరావు, సిఎస్ఆర్ డి. వెంకటరావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జంతువులపై ప్రేమతో ఉండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : నోరులేని మూగజీవాల పట్ల ప్రేమతో ఉండాలని కలెక్టర్ రవి పటాన్ శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జంతు నిషేధాన్ని అమలు చేసేందుకు క్రూరత్వ నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. దీనిపై కమిటీని ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. మండలాల వారీగా ఎస్‌పిసిఎ కమిటీలు వెయ్యాలన్నారు. సమావేశంలో జెసి కల్పనా కుమారి, పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాదరావు, జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి, జిల్లా రవాణా శాఖ అధికారి ఎం వీర్రాజు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆసరాపై అవగాహన సదస్సులు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని జమౌదులపాలెం, కన్నూరుపాలెం, జి.భీమవరం గ్రామాల్లో మూడు విడత ఆసరాపై అవగాహన సదస్సులు శుక్రవారం నిర్వహించారు. మహిళలు కు ఆసరా కరపత్రం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కలగా లక్ష్మి, జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, సర్పంచులు కలగా గున్నయ నాయుడు, హనుమంతు వెంకట లక్ష్మణరావు, కరక రాజ్యలక్ష్మి, కరక సోము నాయుడు, ఎమ్‌పిటిసి అల్లం శంకర్ కరక శేషు పాల్గొన్నారు.

దేవరాపల్లి : ఆసరా పథకం మహిళల ఆర్థిక అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అవుతుందని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు అన్నారు. దేవరాపల్లి సచివాలయం -2లో శుక్రవారం డ్వాక్రా మహిళలతో సమావేశం జరిగింది.

బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి, బుచయ్యపేట తదితర గ్రామాల్లో ఆసరాపై అవగాహన సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మే నాటికి రీ సర్వే పూర్తి : జెసి

ప్రజాశక్తి- అనకాపల్లి : సగ్రమ భూమి రీ సర్వే పనులు మే నెల నాటికి పూర్తవుతుందని భావిస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్లో జెసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 141 గ్రామాల్లో రీ సర్వే జరిగిందని, రెండో దశలో 247 గ్రామాల్లో గ్రౌండ్ వర్క్ అవుతుందని చెప్పారు. రీ సర్వేలో మార్పులు చేర్పులు కూడా చేసుకునే అవకాశం ఉందనే విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. దీనిపై ఎటువంటి అపోహలకు గురికావద్దని హితవులికారు. దీనిపై కలెక్టర్ పిఆర్ డిపార్ట్మెంట్ పూర్తిస్థాయిలో ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. అనకాపల్లి, సబ్బవరం, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లో భూ ఆక్రమణలు జరిగాయని, వాటిని తొలగించే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 22ఏ కేసులు చాలా పరిష్కరించామని వెల్లడించారు.

స్కీం వర్కర్ల మహా ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 28న న్యూఢిల్లీలో స్కీం వర్కర్లు నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కోన లక్ష్మణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు బండారు వెంకటేష్, పిన్నింటి రాజు, సిహెచ్ నాయుడు, వి హరీష్ పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : స్థానిక స్వయంభు విఘ్నేశ్వరస్వామి ఆలయం హుండీని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మంగిపూడి శ్రీధర్ ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి ఎస్‌వివి.సత్యనారాయణ మూర్తి సమక్షంలో శుక్రవారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.1,69,351 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సున్న నాగేశ్వరరావు, ధర్మకర్తలు సువ్వాడ విజయలక్ష్మి, కొణతాల జయలక్ష్మి, పూసర్ల సుబ్బలక్ష్మి, జ్యోతుల శ్రీను, మెడికల్ మూర్తి, కొండల గణపతి, అర్చకులు కొడమంచిలి చలపతిరావు వెంకట్రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాదయాత్ర

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ మండల కేంద్రంలోని బిసి కాలనీ, ఎస్‌సి కాలనీ, పరవాడ ప్రధాన రహదారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాదయాత్ర చేశారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కెఎస్‌ఎ రామయ్య నాయుడు, ఆర్‌ఆర్ నాయుడు, చిన్న కోట రాము, మలపు రెడ్డి కోటేశ్వరరావు రావు, బోయిన భానుమూర్తి యాదవ్, కత్తెర శ్రీధర్, సూరిశెట్టి ఆది బాబు, కావలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాహుల్‌పై అనర్హత వేటు ప్రజాస్వామ్య విరుద్ధం

ప్రజాశక్తి-చోడవరం : కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి గూనురు వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో బిజెపి పాలనలో ఆర్థిక నేరాలు చేసి ఎక్క తరబడి కోర్టుల్లో కేసులు నడుస్తున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా, తీర్పు వెలువడిన వెంటనే రాహుల్ గాంధీపై చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్న రాహుల్ గాంధీపై కక్షపూరితంగా వ్యవహిస్తున్నట్లు ఆరోపించారు. తక్షణమే అనర్హతను ఉపసంహరించుకోకపోతే ఉద్యమం చేపడగామని హెచ్చరించారు.

ప్లాస్టిక్ సంచులు వాడితే జరిమానా

ప్రజాశక్తి- యలమంచిలి : పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగించే ప్లాస్టిక్ వాడకం నిషేధించడం జరిగిందని, ఎవరైనా బజారులో ప్లాస్టిక్ సంచులు వాడితే రూ.వెయ్యి జరిమానా విధించడం జరుగుతుందని యలమంచిలి మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి హెచ్చరించారు. ఆమె యలమంచిలి 5వ వార్డులో ఇంటింటికీ పర్యటించి చేతిగుడ్డ సంచులు పంపిణీ చేశారు. తన సొంత నిధులతో 620 కుటుంబాలకు పర్యావరణ హితమైన చేతి సంచులు పంపిణీ చేసినట్లు మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు తెలిపారు. కమిషనర్ తోట కృష్ణవేణి, కొక్కిరాపల్లి బ్యాంకు ఛైర్మన్ మళ్ల కొండబాబు, మాజీ వైస్ ప్రిన్సిపాల్ పూరీ జగన్నాథ్ పాల్గొన్నారు.



గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమా కుమారి

భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటం

-సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అప్పలరాజు -476వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి: హెటిరో డ్రగ్స్ కంపెనీ నూతన పైపులైను ఏర్పాటుకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల పోరాట స్ఫూర్తితో పోరాడుతామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మత్స్యకార నాయకులు స్పష్టం చేశారు. పైపులైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 476వ రోజుకు చేరింది.శుక్రవారం భగత్ సింగ్ చిత్రపటానికి ధర్నా శిబిరం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ,బ్రిటిష్ సామ్రాజ్య వాదాలను భారతదేశం నుండి తరిమికొట్టి, మన దేశానికి స్వాతంత్ర్యం సాధించడానికి విప్లవ మార్గాన్ని ఎంచుకున్న మహావీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు. ఆయన త్యాగం ఎందరో యువకులను కదిలించి స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామ్యం చేసిందని తెలిపారు. ఆయన చూపిన తెగువ, పట్టుదల నేటి యువతరంకు ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. ఆ రోజుల్లో విదేశీ సామ్రాజ్య వాద పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడితే, ఈ రోజుల్లో మత్స్యకారులు ఉపాధిని కాపాడుకోవడానికి స్వదేశీ పెట్టుబడుదారులతో పోరాడవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా భారతీయులంతా స్వాతంత్ర్యం కోసం ఎలా వీరోచితంగా పోరాడారో మత్స్యకారులు కూడా రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా పోరాడి ఉపాధిని, పర్యావరణాన్ని ఈ ప్రాంతాన్ని కాపాడాలని కోరారు.ఎట్టి పరిస్థితుల్లోనూ పైపులైను వేయడానికి అంగీకరించే ప్రసక్తే లేదని తెలిపారు ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు వాసుపల్లి నూకరాజు, గోసల సోమేశ్వరరావు, మైలపల్లి జాన్, అప్పారావు, గోసల కాశీ, మైలపల్లి బాపూజీ, పిక్కి రాజు, చోడిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అప్పలరాజు, మత్స్యకారులు



చెరువులు పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారిణి

ఉద్దండపురంలో రీ సర్వే పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఉద్దండపురంలో భూముల రీ సర్వేను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి పరిశీలించారు. మ్యాప్‌ను పరిశీలించి సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంపద కేంద్రాన్ని పరిశీలించారు. సంపద కేంద్రం నిర్వహణ చేపట్టకపోవడం పట్ల పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. వెంటనే నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. గ్రామంలో అభివృద్ధికి ఎంపిక చేసిన చెరువును పరిశీలించి సుందరీకరణ పనులపై అడిగి తెలుసుకున్నారు. చెరువును ఆహ్లాదకరంగా తీర్చి దిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపిఆర్‌డి నారాయణ, జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, ఎంపిటీసీ సభ్యులు బచ్చల రాజు, వైసిపి మండల శాఖ అధ్యక్షులు పాపారావు పాల్గొన్నారు.



చికిత్స చేస్తున్న పశు వైద్యఅధికారులు

పాడి గేదెకు పాముకాటు

ప్రజాశక్తి -చీడికాడ: పాముకాటుకు గురైన గేదెకు చికిత్స అందజేశారు. మండలంలోని బయలుపూడి సచివాలయం అడవుల అగ్రహారం గ్రామంలో సలాది కొండబాబుకు చెందిన పాడి గేదెను విష సర్పం గురువారం కాటు వేసింది. శుక్రవారం ఉదయం రైతు గేదెను చూడగా శరీరం అంతా వాపులతో ఉండటంతో బయలుపూడి పశుసంవర్ధక సహాయకులు శరగడం గంగు నాయుడుకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు చీడికాడ పశు వైద్య అధికారి గాయత్రీ, మాడుగుల పశుసంవర్ధక సహాయ సంచాలకులు చిట్టి నాయుడు గెదెకు చికిత్సను అందించారు.

గ్రామాల్లో విగ్రహాల ప్రతిష్ట



పూజలు చేస్తున్న భక్తులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో లింగంపేట పంచాయతీ శివారు రామచంద్రపురం గ్రామంలో శుక్రవారం గ్రామస్తులు సహకారంతో నిర్మించిన ఆలయంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు. గత మూడు రోజులుగా గ్రామస్తులు ఆధ్వర్యంలో వేద పండితులతో హోమాలు నిర్వహించి శుక్రవారం ఆంజనేయస్వామి, వినాయకుడు, కుమారస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాలను ప్రతిష్టించారు.అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగంపేట, గైరంపేట, తాళ్ల చీడికాడ, గింజర్తి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలో వి.శరభవరం గ్రామంలో శుక్రవారం సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించినట్లు గ్రామ కమిటీ తెలిపారు. ఈ మహోత్సవంలో మహిళల కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా చోడవరం మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, రైతు నాయకులు నాయుడు, టీడీపీ ఇన్‌చార్జ్ బత్తుల తాతబ్బాయి తదితరులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న సిడిపిఒ

రక్తహీనత నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: పౌష్టికాహార పక్షోత్సవాలలో భాగంగా పోషణ్ పక్వాడా 2023 కార్యక్రమాన్ని శుక్రవారం నర్సీపట్నం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ మేరీ సువార్త ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక బీసీ కాలనీ లోని మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేరీ సువార్త మాట్లాడుతూ, గర్భిణీలు,, బాలింతలు, కిశోర బాలికలలో వచ్చే రక్తహీనత నివారణ చర్యలపై సమగ్రంగా వివరించారు. వ్యక్తిగత ఆరోగ్యం పై మహిళలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కాల్షియం, ఐరన్, పీచు పదార్థాలు ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ శిరసపల్లి నాని, అంగన్వాడి సూపర్వైజర్ కే.రామలక్ష్మి, ఇంచార్జ్ ఎన్.కృష్ణ పాల్గొన్నారు.



ఎంపిడిఓ కార్యాలయం వద్ద చేరిన నీరు

ఈదురు గాలులతో భారీ వర్షం

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో శుక్రవారం ఈదురు గాలుతతో కూడిన భారీ వర్షం కురియడంతో పలు గ్రామాల్లో ప్రాంతాలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నీరు నిలిచింది. సీతారామరాజు నగర్ పరిసర ప్రాంతాల్లో నల్లాలు నిండి పోవడంతో రోడ్లపై నీరు నిలిచింది.

రామాలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సిహెచ్ నాగాపురం పంచాయతీ శివారు గ్రామం పల్లాఊరులో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ యలమంచిలి రఘురామచందర్రావు మాట్లాడుతూ, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ సహకారంతో రూ.10 లక్షలు విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పాసిల బాలసుబ్రమణ్యం, వార్డు మెంబర్లు గంటల గణేశ్వరి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అవంతి కళాశాలలో సాంకేతిక సదస్సు

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి సాంకేతిక సాదస్సు శుక్రవారం ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగాఎన్ఎస్‌టియల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జే.ఎన్.టి.యు ప్రొఫెసర్ జే.వి. ఆర్ .మూర్తి, అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజెస్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ ఎం.ప్రియాంక హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మనిర్భార్ భారత్‌లో భాగంగా మన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మనకు కావలసిన ఉత్పత్తులు మనమే తయారు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అందుకుగాను ప్రతి ఒక్కరూ వినూత్నంగా ఆలోచించాలని తెలిపారు. అవంతి విద్యా సంస్థల జనరల్ సెక్రెటరీ డాక్టర్ ఎం.ప్రియాంక మాట్లాడుతూ, ఇన్నోవేషన్ ప్రమోట్ చేసే విషయంలో అవంతి విద్యాసంస్థలు ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల శాఖధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు



హాజరైన అధికారులు

పలు చోట్ల గ్రామసభలు

ప్రజాశక్తి -కోటవురట్ల: ఈనెల 31న జరగనున్న ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభలో భాగంగా.. మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో అభివృద్ధి సంక్షేమ పథకాలపై సామాజిక తనిఖీపై గ్రామ సభలు నిర్వహించారు. చౌడువాడ, గొట్టువాడ, రామచంద్ర పురం, చిన్న బొడ్డేపల్లి, కోటవురట్ల, బోడపాలెం, పీకే పల్లి గ్రామాలలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డి ప్రేమ్ కుమార్, ఏపీవో గంగు నాయుడు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానికంగా నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర డిమాండ్ చేశారు. శ్రీకన్య కూడలి నుంచి ర్యాలీగా బయలుదేరి ఆర్డీవో కార్యాలయం చేరుకొని శుక్రవారం నిరసన చేపట్టారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిడ్కో గృహాలను ఉగాది నాటికే అప్పగిస్తామని సీఎం జగన్ మోహన్ రెడ్డి చెప్పి ఆ మాటను తప్పారన్నారు. ఇటు ఇంటి అద్దె కట్టుకోలేక, అటు బ్యాంక్ రుణాలు చెల్లించలేక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడ్కో ఇళ్లపై ఉన్న రుణాలు మాఫీ చేస్తామని సిఎం చెప్పారని గుర్తు చేశారు. 9వ వార్డు కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం వచ్చిన ఈ నాలుగేళ్ల కాలంలో టిడ్కో గహాలు అప్పగించకపోవడం దారుణమన్నారు.



ఆందోళన చేపడుతున్న నాయకులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి ఎస్. రాయవరం: మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి (డి.ఎం.ఒ) కె.వరహాలుదొర ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ల్యాబ్ రికార్డులను తనిఖీ చేసిన ఆయన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా యాంటీ లార్వా ఆపరేషన్ ప్రాంతాలను సందర్శించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఇంట్లో నీరు నిల్వ ఉన్న పాత్రలపై మూతలు ఉంచాలని, ఫ్రిజ్ వెనక తొట్టెలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి. నాయుడు, ఆరోగ్య విస్తరణ అధికారి బి.సత్యనారాయణ, హెల్త్ విజిటర్ సి.హెచ్.రమణ పాల్గొన్నారు.

వైద్య సేవలపై హర్షం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక ఉమా నారాయణ చిన్న పిల్లల ఆసుపత్రి వైద్యులు పుల్లేటికుర్తి మల్లికార్జునరావు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య సేవలందించడంపై గిరిజన యువజన సంఘం అధ్యక్షులు టి.మల్లేష్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, నిప్పు అంటుకొని కాలిపోవడంతో తీవ్ర గాయాలైన బాలికకు వైద్యులు డాక్టర్ పుల్లేటికుర్తి మల్లిఖార్జునరావు మెరుగైన వైద్యం అందిస్తున్నారని కొనియాడారు.

మోడీ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు



దీక్షల్లో కూర్చున్న ఉక్కు కార్మికులు

ప్రజాశక్తి - ఉక్కునగరం : దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని కుట్ర పన్నుతున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి త్వరలో ప్రజలే గట్టిగా బుద్ధి చెబుతారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు స్పష్టం చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 771వ రోజుకు చేరుకున్నాయి. స్టీల్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం కార్మికులు దీక్షల్లో కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి, వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు నెలల పాటు నిల్వ ఉండాల్సిన రా మెటీరియల్‌ను యాజమాన్యం కేవలం కొన్ని రోజులకే పరిమితం చేస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ముకాస్తున్న బిజెపి విధానాలను దేశ ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. తీసుకున్న రుణాలకు పూర్తి స్థాయిలో వడ్డీలు కడుతున్న స్టీల్‌ప్లాంట్‌కు మోడీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. కోకింగ్ కోల్, ఇతర రా మెటీరియల్‌ను కొనుక్కోవడానికి అదనపు రుణాల కోసం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రయత్నిస్తుండగా కేంద్రం మోకాలడ్డుతోందన్నారు. ప్రస్తుతం రా మెటీరియల్ నిల్వలు హరించుకుపోయాయని తెలిపారు. అదానీపై మోడీ ప్రభుత్వం, బ్యాంకులు అమిత ప్రేమను కురిపిస్తున్నాయన్నారు. కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరాజు, డేవిడ్, పి.శ్రీనివాస్, నరేంద్ర, అలమండ శ్రీనివాసరావు, సైన్ బాబు, ఆర్.వెంకటరావు, రవి కిరణ్, మల్లేశ్వరరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

720వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ఎంవిపి.కాలనీ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 720వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు కంచరపాలెం జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఒ.అప్పారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ దేశ సంపదని, ప్రైవేటుపరం చేసే హక్కు మోడీకి లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు కట్టబెడితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో జోన్ నాయకులు ఎం.ఈశ్వరరావు, ఎస్.రామ్‌గోపాల్, ఎస్.శ్రావణ్, డి.కల్యాణి, ప్రొఫెసర్ సూరప్పుడు, సిహెచ్.అప్పారావు, కంతల్లి, బంగారయ్య పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి-గొలుగొండ:అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలపై అంగన్వాడి కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధను కనపరచాలని ఎంపిడిఒ డేవిడ్‌రాజు సూచించారు. మండలంలో



తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ

వప్పుశెట్టిపాలెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు రక్తహీనత లేకుండా చూసుకోవాలని సూచించారు. పిల్లల్లో రక్తహీనతను అధిగమించే కార్యక్రమాలను చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. అనంతరం స్థానిక ఎంపిపి పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పోషక విలువలతో కూడిన ఆరోగ్యకరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఆయన సూచించారు.

రేషన్ సకాలంలో ఇవ్వాలి

ప్రజాశక్తి- కోటవురట్ల:ప్రభుత్వం అందిస్తున్న రేషన్ సరుకులు సకాలంలో లబ్ధిదారులకు అందజేయాలని



మాట్లాడుతున్న తహశీల్దారు

తహసీల్దార్ జానకమ్మ సూచించారు. శుక్రవారం ఆమె చౌక ధరల దుకాణాల డీలర్ల, ఇంటింటికి రేషన్ సరుకుల వాహన దారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి రేషన్ సరుకులు వాహనాల ద్వారా ఇంటింటికీ వెళ్లి సకాలంలో అందజేయాలన్నారు. సరుకుల నాణ్యత చూసుకొని మాత్రమే లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. ఎవరైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:టెన్త్ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీనువాసరావు ఆకాంక్షించారు. మండలంలోని పెదఉప్పలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పినపాత్రుని గణేష్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు శుక్రవారం ఘనంగా జరిగింది. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వంటిదన్నారు. ఇప్పటి నుండి చక్కని ప్రణాళికతో భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలని సూచించారు. పదవ తరగతి పరీక్షా విధానంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు ఆధార్ స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి- నక్కపల్లి:ఆధార్ అనుసంధానం పై శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికలు రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బూత్ లెవెల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆధార్ అనుసంధానంకు సంబంధించి వెనకబడి ఉన్నందున ఆధార్ అనుసంధానం శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్య వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తహసీల్దార్ నీరజ, తదితరులు పాల్గొన్నారు .



మట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి

ఘనంగా అనిత జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత జన్మదిన వేడుకలు శుక్రవారం అడ్డురోడ్డులో పార్టీ నాయకులు, కార్యకర్తల ఘనంగా నిర్వహించారు. అడ్డురోడ్డులో ఉన్న ఆభయాంజనేయ స్వామిని అనిత దర్శించుకుని ఆలయం నుండి ర్యాలీగా ఫంక్షన్ హాల్ కు చేరుకున్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణ, మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి పీలా గోవింద సత్యనారాయణ,, మాడుగుల టీడీపీ ఇంఛార్జి పివిజి కుమార్ పాల్గొన్నారు.



కేకును కట్ చేస్తున్న అనిత

చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషా రాణి సూచించారు. నక్కపల్లిలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రం వద్ద శుక్రవారం పారిశుధ్య నిర్వహణకు సంబంధించి ఎంపిక చేసిన మోడల్ పంచాయతీలు



మాట్లాడుతున్నశిరీషారాణి

గొలుగొండ, కోటవురట్ల, నర్సీపట్నం, నాతవరం, నక్కపల్లి మండలాల నుండి రెండేసి పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది కు చెత్త నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిరీషా రాణి మాట్లాడుతూ, ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాలను వేయకుండా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల్లో మార్పు వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ జీవన విధానంలో భాగస్వామ్యం కావాలన్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను వర్మీ కంపోస్ట్‌గా తయారు చేయాలని సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. సంపద కేంద్రాల జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, చెత్త సేకరణ, నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి డస్ట్ బిన్‌లు అందజేసి, వాటిలో తడి, పొడి చెత్త వేరు వేరుగా వేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ మూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, ఈఓపిఆర్‌డి వెంకటనారాయణ, సర్పంచ్ జయ రత్నకుమారి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఆయా మండలాలకు సంబంధించి సర్పంచ్ లు, ఎంపీడీవోలు, ఈఓపిఆర్‌డిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జి 20 పేరిట తోపుడుబండ్లను తొలగించొద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో ఈ నెల 28, 29 తేదీల్లో జి-20 సదస్సు జరుగుతున్న నేపథ్యంలో తోపుడుబండ్ల కార్మికులను బలవంతంగా జివిఎంసి అధికారులు తొలగించడం అన్యాయమని సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, విశాఖపట్నం తోపుడుబండ్ల కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సింహాచలం అన్నారు. ఉపాధి కోల్పోయిన వీధి విక్రయదారులకు ప్రభుత్వం రోజుకు రూ.500 చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం మద్దిలపాలెం జంక్షన్‌లో సిఐటియు మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖకు మంత్రుల దగ్గర నుండి రాష్ట్రపతి వరకు ఎవరు వచ్చినా తోపుడుబండ్ల కార్మికులు రోడ్డుపై వ్యాపారాలు చేయనీయకుండా జివిఎంసి, పోలీస్ అధికారులు అన్యాయంగా వ్యవహరిస్తున్నారన్నారు. అమూల్ పాల బడ్డీలకు, రిలయన్స్ షాపులకు రక్షణ కల్పిస్తున్న ప్రభుత్వం పేదవారిపై మాత్రం విరుచుకుపడుతోందన్నారు. నగరంలో తోపుడుబండ్ల కార్మికులకు రుణాలు ఇవ్వాలని, హాకర్ జోన్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు



నినాదాలు చేస్తున్న గిరిజనులు

గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి -రోలుగుంట:సాగులో ఉన్న భూములు సాగులో లేనట్లు తప్పుడు రిపోర్టులు ఇచ్చిన రెవెన్యూ రిపోర్ట్‌పై జాయింట్ కలెక్టర్ స్వయంగా విచారణ చేయాలని, ఆర్ఓఆర్ యాక్టు విరుద్ధంగా వివరిస్తున్న రెవెన్యూ అధికారిపై చర్యలు తీసుకోవాలని పనసలపాడు గ్రామంలో గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనేతలకు ఇచ్చిన పట్టాలు రద్దు చేయాలని, తప్పుడు రిపోర్టులు ఇచ్చిన రెవెన్యూ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గెమ్మెలి చంద్రరావు, సూకనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు. సాగులో లేని వారికి పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చిన అధికారిపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. స్వయంగా జాయింట్ కలెక్టర్ పరిశీలించాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-రావికమతం:రావికమతం మండల యూటీఎఫ్ అధ్యక్షునిగా పోలిన అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.శివశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎంపీపీ పాఠశాల(మెయిన్) లో మండల యు.టి.ఎఫ్. సర్వసభ్య సమావేశం శుక్రవారం ఏర్పాటు చేసి నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కాళింగ సతీష్ సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా కే.శ్రీనివాసరావు, సహాధ్యక్షులుగా బి .అప్పలనాయుడు, కే.గౌరీ, కోశాధికారిగా మట్టా అప్పారావు, కార్యదర్శులుగా జి.నాగేశ్వరరావు, రాజేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్గా బి.కోటేశ్వరరావు జిల్లా కౌన్సిలర్గా యువి రమణమూర్తి, కే.శ్రీనులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ విశేషంగా కృషి చేస్తుందన్నారు.

డ్వాక్రా మహిళల సమావేశం

ప్రజాశక్తి -కొత్తకోట:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల హామీ లో భాగం గా డ్వాక్రా మహిళలకు వైయస్సార్ ఆసరా పథకం తో మహిళలు ఖాతాలోకి నగదు జమ చేయడం హర్షనీయమని కొత్తకోట సర్పంచ్, ఉప సర్పంచ్ కోన లోవరాజు, పందల దేవ అన్నారు. శుక్రవారం కొత్తకోట గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో డ్వాక్రా మహిళలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొత్తకోట గ్రామంలో డ్వాక్రా సంఘాలకు సుమారు రూ.8 కోట్ల 97 లక్షలు మహిళల ఖాతాలలో జమ కావడం హర్షణీయమ న్నారు. ఎంపిటిసి పూడి దేవ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -కొత్తకోట:నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్)కు మరుపాక మోడల్ స్కూల్, టి.అర్జాపురం, చినపాచిల హైస్కూల్కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్ఎంలు కెఆర్ఎస్ నాయుడు, ప్రసన్నకుమార్.కె. సత్యసునీల్ శుక్రవారం తెలిపారు. మండలం నుంచి ఈ ఏడాది 28 మంది హాజరు అయ్యారని వారు పేర్కొన్నారు.